RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY    తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 44 ISSUE NO : 44 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | శుక్రవారం, ఆగస్టు, 1, 2025 Friday, August, 1, 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-



ఏపీ సీఐడీ మాజీ చీఫ్ సంజయ్

## ముందస్తు బెయిల్ రద్దు

దిల్లీ: ఏపీ సీఐడీ మాజీ చీఫ్ సంజయ్ ముందస్తు బెయిల్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. సంజయ్‌కు ముందస్తు బెయిల్ ఇస్తూ గతంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేస్తూ గురువారం ఆదేశాలు జారీ చేసింది. అగ్నిమాపక విభాగంలో అవినీతి కేసులో ఆయనపై ఏపీ ప్రభుత్వం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో సంజయ్‌కు ఏపీ హైకోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చింది. ఉన్నత న్యాయస్థానం తీర్పును రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. దీనిపై సుదీర్ఘ వాదనల తర్వాత జస్టిస్ అమానుతుల్లా, జస్టిస్ ఎస్.వి.ఎన్ భట్టి ధర్మాసనం ఇవాళ తీర్పు వెలువరించింది. విచారణ సందర్భంగా హైకోర్టు తీర్పుపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ముందస్తు బెయిల్ దశలోనే ట్రయల్‌ను పూర్తి చేసినట్టు ఉందని వ్యాఖ్యానించింది.




పార్టీ ఫిరాయింపులపై..

## స్పీకర్‌దే తుది నిర్ణయం

### 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాల్సిందే

ఫిరాయింపులపై పార్లమెంట్ సమీక్షించాలి

బిఆఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో సుప్రీం తీర్పు

న్యూఢిల్లీ, : తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పిటిషన్‌ను అనుమతించిన సుప్రీం ధర్మాసనం.. వీలైనంత త్వరగా లేదా 3 నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. అయితే, ఫిరాయింపు ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టు వేటు వేయాలంటూ బీఆర్ఎస్ చేసిన విజ్ఞప్తిని సీజేఐ గవాయ్ తోసిపుచ్చారు. అదే సమయంలో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. స్పీకర్ నిర్ణయానికి కాలపరిమితి విధించాలనే అంశంపై పార్లమెంట్ నిర్ణయం తీసుకోవాలని సీజేఐ గవాయ్ ఆదేశించారు. కాగా, ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపుల కేసుపై సుప్రీంకోర్టులో సుధీర్ఘ వాదనలు జరిగాయి. స్పీకర్ తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలనే అంశంలో కోర్టులు జోక్యం చేసుకోవచ్చా లేదా అనే దానిపై సుప్రీంకోర్టులో సుధీర్ఘ వాదనలు నడిచాయి.



భారత కంపెనీలపై..

## ఆంక్షలు

### మరో షాకిచ్చిన ట్రంప్

- ఇరాన్ నుంచి పెట్రోలియం కొనుగోలు చేయడంపై ఆగ్రహం

వాషింగ్టన్: ఇరాన్ తో వ్యాపారం వద్దని తాము చెప్పినా వినకుండా చమురు కొనుగోలు చేస్తున్న కంపెనీలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా మొత్తం 20 కంపెనీలపై ఆంక్షలు విధించారు. ఈ మేరకు అమెరికా విదేశాంగ శాఖ తాజాగా ప్రకటన విడుదల చేసింది. ఈ జాబితాలో భారత్ కు చెందిన ఆరు కంపెనీలు కూడా ఉన్నాయి. ఇప్పటికే మన దేశంపై 25 శాతం టారిఫ్ లు విధించిన ట్రంప్.. చమురు కంపెనీలపై ఆంక్షలతో మరో షాక్ ఇచ్చారు. ఆంక్షలు విధించడంతో ప్రస్తుతం ఆయా కంపెనీలు, వ్యక్తులకు అమెరికాలో ఆస్తులు ఉంటే వాటిని ఫ్రీజ్ చేస్తారు. 'మధ్యప్రాచ్యంలో అస్థిరతకు ఆజ్యం పోస్తున్న ఇరాన్ పై ఆర్థిక ఒత్తిడి తెచ్చేందుకు అమెరికా కఠిన చర్యలు చేపట్టింది.




భారత ఆర్థిక వ్యవస్థ

## నిర్వీర్యం

### కేంద్రంపై రాహుల్ విమర్శలు

న్యూఢిల్లీ, : భారతదేశ ఆర్థిక వ్యవస్థ నిర్జీవ స్థితిలో ఉందని ప్రధాని మోడీ, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మినహా అందరికీ తెలుసునని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. దేశ ఆర్థిక వ్యవస్థను బిజెపి నాశనం చేసిందని ధ్వజమెత్తారు. భారత ఆర్థిక వ్యవస్థపై ట్రంప్ విమర్శ గురించి పార్లమెంట్ ఎదుట గురువారం మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా స్పందించారు. అవును, ట్రంప్ చెప్పింది వాస్తవమేనని, ప్రధాని, ఆర్థిక మంత్రికి తప్ప అందరికీ ఈవిషయం తెలుసునని అన్నారు. ట్రంప్ వాస్తవాన్ని వెల్లడించినందుకు సంతోషిస్తున్నానని అన్నారు. ఇందులో ఆశ్చర్యం లేదని, అదానీకి సహాయం అందించడం కోసం బిజెపి ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిందని అన్నారు. అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటుందని, ఆవిషయాన్ని ట్రంప్ స్పష్టం చేస్తారని, ట్రంప్ చెప్పినట్లు ప్రధాని మోడీ చేస్తారని అన్నారు. భారతదేశ దిగుమతులపై 25శాతం సుంకం విధిస్తున్నట్లు- ప్రకటించిన తర్వాత, భారత్,రష్యాల ఆర్థిక వ్యవస్థలు నిర్జీవమైనవని అమెరికా అధ్యక్షులు ప్రకటించిన సంగతి తెలిసిందే.



నలుగురు కొత్త జడ్జిల

## ప్రమాణం

### ప్రమాణ స్వీకారం చేయించిన చీఫ్ జస్టిస్

హైదరాబాద్,తెలంగాణ దిశ : తెలంగాణ హైకోర్టులో కొత్తగా నియమితులైన నలుగురు జడ్జిలు ప్రమాణ స్వీకారం చేశారు. చీఫ్ జస్టిస్ వీరితో ప్రమాణం చేయించారు. జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్, జస్టిస్ రామకృష్ణా రెడ్డి, జస్టిస్ సుద్దాల చలపతిరావు, జస్టిస్ గౌస్ మీరా మొహియుద్దీన్‌తో సీజే జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ ప్రమాణం చేయించారు. హైకోర్టులో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు న్యాయమూర్తులు, లాయర్లు హాజరయ్యారు. హైకోర్టులో లాయర్లుగా ఉన్న ఈ నలుగురిని జడ్జిలుగా నియమించాలంటూ సుప్రీంకోర్టు కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. దీంతో వారి నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 28న ఆమోదముద్రవేశారు. దీంతో రాష్ట్ర హైకోర్టులో జడ్జిల సంఖ్య 30కి చేరింది. మొత్తం 42 మంది జడ్జిలు ఉండాలి.



తీర్పును స్వాగతించిన

## కెటిఆర్

### 3 నెలల్లో ఉప ఎన్నికలు తప్పవని వ్యాఖ్య

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** 'సత్యమేవ జయతే' అని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్‌లో పోస్టు చేశారు. తెలంగాణలో పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల అనర్హతపై 3 నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన ఈమేరకు స్పందించారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పును భారత రాష్ట్ర సమితి స్వాగతిస్తోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడిన సీజేఐకి దన్యవాదాలు తెలిపారు. రాహుల్ గాంధీ చెప్పే పాంచ్ న్యాయ సూత్రకు కట్టుబడి ఉండాలి. చట్టవిరుద్ధంగా 10 మంది పార్టీ మారారని చెప్పేందుకు దర్యాప్తు అవసరం లేదు. కష్ట సమయాల్లో మాతో నిలిచిన భారత రాష్ట్ర సమితి లీగల్ టీమ్‌కు ధన్యవాదాలు.



ఎన్డీఏకు పన్నీర్ సెల్వం

## గుడ్‌బై..

చెన్నై : తమిళ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. దివంగత నేత జయలలితకు అత్యంత నమ్మకస్థుడుగా ఉన్నమాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం ఎన్డీయే నుంచి వైదొలగారు. ఈ మేరకు మాజీ మంత్రి, సెల్వంకు నమ్మినబంటు రామచంద్రన్ ప్రకటించారు. ఆయన ప్రకటిస్తున్న సమయంలో సెల్వం కూడా అక్కడే ఉన్నారు. మార్నింగ్ వాక్ సమయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను పన్నీర్ సెల్వం కలిశారు.పలు విషయాలపై చర్చించినట్లు తెలుస్తోంది.





మాలేగావ్ పేలుళ్ల కేసులో

## సంచలన తీర్పు

- నిందితులు ఏడుగురూ నిర్దోషులే
- ఆరోపణలు ఎదుర్కొన్న వారిలో మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్
- 17 ఏళ్ల తర్వాత తీర్పు వెలువరించిన ఎన్ఐఏ కోర్టు

ముంబై: దాదాపు 17 ఏళ్లపాటు సుదీర్ఘ విచారణ జరిగిన మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసు తీర్పుపై నెలకొన్ని ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసులో ముంబయిలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు గురువారం (జూలై 31) సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ఎంపీ సాధ్వీ ప్రజ్ఞా ఠాకూర్ సహా మొత్తం ఏడుగురిని నిర్దోషులుగా ప్రకటించింది ఎన్ఐఏ కోర్టు. నిందితులకు వ్యతిరేకంగా నేరం రుజువు చేయడానికి ప్రాసిక్యూషన్ వద్ద ఎలాంటి సాక్ష్యాలు లేవని న్యాయస్థానం పేర్కొంది. పేలుడులో వాడిన బైక్ సాధ్వీ ప్రజ్ఞాకు చెందినదిగా ప్రాసిక్యూషన్ నిరూపించలేకపోయిందని.. నిందితులపై మోపిన అభియోగాలు రుజువు చేయలేకపోవడంతో ఏడుగురిని నిర్దోషులు ప్రకటిస్తున్నట్లు

- 15 నెలల పాటు విచారించిన కమిషన్
- కెసిఆర్, ఈటెల, హరీష్, తదితరలు విచారణ
- 115 మందిని విచారించి నివేదిక రూపొందించిన కమిషన్



జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక

## సమర్పణ

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** కాళేశ్వరంపై విచారణ చేపట్టిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తన నివేదికను సమర్పించింది. నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు నివేదిక అందజేసింది. 2024 మార్చి 14న కమిషన్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ 15 నెలల పాటు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించి విచారించింది. ఇందులో కెసిఆర్, హరీష్ రావు, ఈటెల రాజేదర్ సహా నీటిపారుదల శాఖ అధికారులను విచారించింది. 115 మందిని విచారణ చేసి సాక్ష్యాలునమోదు చేసింది.కమిషన్ నివేదికతో రాహుల్ బొజ్జా సచివాలయానికి బయల్దేరారు.

# ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో మార్గదర్శకమైన సేవలందించిన లక్ష్మణ్

## - పదవీ విరమణ సందర్భంగా లక్ష్మణ్ కు ఘనంగా సన్మానం




**మేడ్చల్ కలెక్టరేట్ (ప్రతినిధి, జూలై 31, తెలంగాణ దిశ) :**తెలంగాణ నాన్ గెజెటెడ్ ఆఫీసర్స్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సీనియర్ అసిస్టెంట్ కె. లక్ష్మణ్ పదవి విరమణ సందర్భంగా గురువారం యూనియన్ రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా భవన్‌లో ఆయనను ఘనంగా సన్మానించారు. ఉమ్మడి రంగారెడ్డి (మేడ్చల్ – రంగారెడ్డి – వికారాబాద్) జిల్లా నాన్ గెజెటెడ్ ఉద్యోగుల సంఘానికి నాలుగు దశాబ్దాలుగా విశిష్ట సేవలందించిన కె. లక్ష్మణ్ 43 సంవత్సరాలు 6 నెలల పాటు ప్రభుత్వ విధుల్లో అత్యంత నిబద్ధతతో పని చేసి గురువారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు, అనేక జిల్లా యూనిట్ ప్రతినిధుల సమక్షంలో భావోద్వేగాల మధ్య వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రామ్మోహన్ మాట్లాడుతూ ఉద్యోగ జీవితాన్ని ప్రభుత్వ సేవలకు లక్ష్మణ్ అంకితం చేశారని కొనియాడారు. ఆయన పని చేసిన శాఖల్లో మార్గ దర్శకుడిగా, సమన్వయకర్తగా, నాయకుడిగా ఎంతో సమర్థంగా పనిచేశారని అన్నారు. సహచర ఉద్యోగులకు ప్రోత్సాహం ఇచ్చిన విధానం, సమస్యలను పరిష్కరించే శైలి ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలిచేలా ఉందన్నారు. ప్రభుత్వ సేవలను విశ్వాసంతో ముందుకు తీసుకెళ్లిన లక్ష్మణ్ లాంటి అధికారి దొరకడం అదృష్టమన్నారు. పదవీ విరమణ అనంతరం ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా అధ్యక్షులు బి. రవి ప్రకాష్ మాట్లాడుతూ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో లక్ష్మణ్ ఎన్నో మార్గ దర్శకమైన సేవలందించారని అన్నారు. తెలంగాణ నాన్ గెజెటెడ్ ఆఫీసర్స్ యూనియన్ పునాదులు బలపడేలా ఆయన చేసిన కృషి చిరస్మరణీయమైనదన్నారు. నిబద్ధత, శ్రమ, త్యాగం ప్రతి ఉద్యోగికి స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. శాలువా, గజమాలతో ఘనంగా సన్మానం చేయడం ఎంతో గౌరవంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్ జిఓ సెంట్రల్




ఈసీ సభ్యులు ఈశ్వర్, శశికాంత్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి విజయ్ కుమార్, వికారాబాద్ జిల్లా అధ్యక్షులు శివ కుమార్, మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు రవి చంద్రన్, కార్యదర్శి భరత్ కుమార్, కోశాధికారి శేష సాయి గిరికాంత్, కలెక్టరేట్ యూనిట్ కోశాధికారి కార్తీక్, అధ్యక్షురాలు నసీమా, కుత్బుల్లాపూర్ యూనిట్ అధ్యక్షురాలు సత్య జ్యోతి, మల్కాజిగిరి యూనిట్ కార్యదర్శి అరుణ, మేడ్చల్ యూనిట్ అధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు అంజన్న, సంజయ్ సింగ్, జేమ్స్ దాస్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.




## కాప్రా సర్కిల్ కార్యాలయంలో రీ సై"కిల్"



**కాప్రా, జూలై 31, (తెలంగాణ దిశ):**కాప్రా సర్కిల్ కార్యాలయంలో ప్లాస్టిక్ బాటిళ్లను మళ్లీమళ్లీ వాడుతున్నారు. అందరికీ చెప్పేది తమకు వర్తించదనుకున్నారేమో కానీ.. తాగి పడేసిన మినరల్ వాటర్ బాటిళ్లలో లోకల్ ఫిల్టర్ వాటర్ నింపి సమావేశానికి, కార్యాలయానికి వచ్చిన వారికి అందజేస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టే జిహెచ్ఎంసి అధికారులు తాగి పడేసిన బాటిళ్లలో నీళ్లు ఇవ్వడం పట్ల సందర్శకులు ఆ సహనం వ్యక్తం చేస్తున్నారు. ఆర్ఆర్ఆర్ లో ఆర్ అంటే రెడ్యూస్ (వీలైనంత వరకు ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం) ఆర్.. రీ సైకిల్ (నూతన ఉత్పత్తి చేయడం) రీయూజ్ (ఉత్పత్తి చేసిన వస్తువును పునర్వినియోగం చేయడం) మని నిర్వచించిన జిహెచ్ఎంసి అధికారులు వాటిని పాటించకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## జనహిత పాదయాత్రకు కుత్బుల్లాపూర్ నేతలు



**కుత్బుల్లాపూర్, జూలై 31, (తెలంగాణ దిశ) :**కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిగి నుంచి గురువారం సాయంత్రం ప్రారంభం కానున్న జనహిత పాదయాత్రకు కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొనే ఈ యాత్రకు కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కుత్బుల్లాపూర్ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి, నర్సారెడ్డి భూపతి రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు తరలి వెళ్లారు.

# గుండెగాం పునరావాస సమస్యపై మానవ హక్కుల వేదిక జోక్యం

## దశాబ్దాల నిరీక్షణకు తెరపడేనా?



**నిర్మల్, జూలై 31, (తెలంగాణ దిశ) :**భైంసా మండలంలోని పల్సికర్ రంగారావు ప్రాజెక్టు ముంపునకు గురైన గుండెగాం గ్రామ ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న పునరావాస సమస్య మరోసారి తెరపైకి వచ్చింది. గతంలో సిపిఐ ఫ్లోర్ లీడర్ కూనంనేని సాంబశివరావు గుండెగాం గ్రామస్తుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ దీర్ఘకాలిక సమస్యపై మానవ హక్కుల వేదిక కన్వీనర్ సరస్వతి తీవ్ర ఆవేదన వ్యక్తం చేసారు. గుండెగాం గ్రామస్తులకు తక్షణమే న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో గుండెగాం గ్రామానికి పునరావాసం కల్పించేందుకు రూ. 100 కోట్ల బడ్జెట్‌ను కేటాయించి హామీ ఇచ్చారని గ్రామస్తులు గుర్తు చేస్తున్నారు. అయితే ఆ హామీ నేటికీ కార్యరూపం దాల్చక పోవడంతో ప్రజల నిరీక్షణ కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం గ్రామంలోని పలు కుటుంబాలు ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివసిస్తున్నాయి. గ్రామంలో విద్యుత్తు అధికారులు విద్యుత్ బిల్లులు వసూలు చేయడం ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ప్రజలకు ఇది అదనపు భారంగా మారింది. విద్యుత్ బిల్లుల భారం నుండి తమకు ఉపశమనం కల్పించాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని వేడుకున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో గుండెగాం ప్రజల కష్టాలు వర్ణనాతీతం. ప్రాథమిక సౌకర్యాలు లేక, భవిష్యత్తుపై అగమ్యగోచరంగా ఉన్న ప్రజల పరిస్థితిని చూసి సరస్వతి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. “వారి బాధలు విని నాకు చాలా బాధగా అనిపించింది. వారికి అన్ని విధాలుగా సహాయం చేస్తానని మాటిచ్చానని ఆమె తెలిపారు. గుండెగాం ప్రజల తరపున పోరాడేందుకు మానవ హక్కుల వేదిక కన్వీనర్ సరస్వతి సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే రామారావు పటేల్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. “గత కొన్ని రోజుల నుండి ఈ సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదు. ముంపునకు గురైన గ్రామ ప్రజలకు కనీస పునరావాసం కల్పించకుండా, నిధులు విడుదల చేసినా అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో చాలా మంది గ్రామస్తులు నిరాశతో తిరిగి వెళ్లిపోయారు. గ్రామస్తులు కలెక్టర్‌ను కలిసినా సమస్య పరిష్కారం కాకపోవడం నిజంగా దురదృష్టకరం,” అని సరస్వతి ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా పునరావాసం కోసం ఎదురుచూస్తున్న గుండెగాం గ్రామ ప్రజలకు న్యాయం జరిగి, వారికి మెరుగైన జీవనం లభిస్తుందని ఆశిద్దాం. ఈ సమస్యపై ప్రభుత్వ స్పందన ఎలా ఉంటుందో వేచి చూడాలి.

# ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి అందే విధంగా కృషి చేయాలి



**కుత్బుల్లాపూర్, జూలై 31, (తెలంగాణ దిశ) :**రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందే విధంగా చర్యలు తీసుకోవాలని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి సూచించారు. గురువారం కుత్బుల్లాపూర్ సుభాష్ నగర్ 130వ డివిజన్ మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం జరిగింది. మహిళా కాంగ్రెస్ బూత్ కమిటీలను నియమించాలని సూచించారు. ముఖ్యంగా ఆరు గ్యారెంటీలను అర్హులైన వారికి అందించాలని కోరారు.



ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాజాల రమ్య, మేడ్చల్ ఉపాధ్యక్షురాలు నారాయణమ్మ, ప్రధాన కార్యదర్శి కార్యదర్శి శోభ, సహాయ కార్యదర్శి సరస్వతి, బ్లాక్ కమిటీ ఉపాధ్యక్షురాలు నాగ శిరోమణి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ చాలా అర్చన, కార్యదర్శి వరలక్ష్మి, మహిళా కాంగ్రెస్ 130వ డివిజన్ అధ్యక్షురాలు తులసి, ప్రధాన కార్యదర్శి ప్రసన్న, ఉపాధ్యక్షురాలు వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శి సంతోషి, కార్యదర్శులు యాస్మిన్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : రాధిక గుప్తా






**మేడ్చల్ కలెక్టరేట్, జూలై 31, (తెలంగాణ దిశ) :** రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. గురువారం షామీర్ పేట్ మండలం అంతాయిపల్లిలోని కలెక్టర్ కార్యాలయంలోని ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తల అవగాహన సదస్సులో పాల్గొన్నారు. మహిళలకు పరిశ్రమల స్థాపన పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళా పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి రాధిక గుప్తా మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలనే సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వయం సహాయక మహిళలకు అధిక మొత్తం రుణాలను 35 శాతం సబ్సిడీతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు పర్చుస్తుందని అన్నారు. మహిళలు అనేక రకాల వ్యాపారాలు చేస్తున్నారని, వ్యాపారంలో లాభాలను ఆర్జించడం సంతోషం కరమని తెలిపారు. మహిళలకు వ్యాపారంలో మార్కెటింగ్ చేయుటకు, రుణాల పొందుటలో ఎమైనా సమస్యలు వస్తే తమ దృష్టి తీసుకురావాలని ఆమె తెలిపారు. ఈ ప్రోగ్రాంలో ఎంపికైన మహిళ వ్యాపారులకు బిజినెస్ నైపుణ్యాలపై శిక్షణ, ప్రొడక్ట్ డెవలప్మెంట్, మార్కెటింగ్ పై అవగాహన అందిస్తారు. నేటి ఆధునిక, సాంకేతి యుగంలో మహిళలు అన్నిరంగాల్లో రాణించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా వీ హబ్ డైరెక్టర్ జాహిద్ షేక్ మాట్లాడుతూ వరల్డ్ బ్యాంక్, కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ ప్రోగ్రాం ద్వారా మహిళల ఆధ్వర్యంలో నడుస్తున్న వ్యాపారాలు, సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి వ్యాపారస్తులకు సబ్సిడీపై ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. రెండు సంవత్సరాల పాటు కొనసాగనున్న ఈ ప్రోగ్రాంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన మహిళా పారిశ్రామికవేత్తలకు తమ బిజినెస్ అభివృద్ధిని వేగవంతం చేసుకుని ఆదాయాన్ని పెంచుకునే అవకాశం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ డిఓ పిడి సాంబశివరావు, మెప్మ పిడి విజయ లక్ష్మీ, వీ హాబ్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ సాయిరామ్ స్వయం సహాక సంఘాల జిల్లా అధ్యక్షులు అజయ లక్ష్మి, డిఆర్‌పి డిఎస్. అమర్‌సింగ్, జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఇతర అధికారులు తదితరులు, వీ హాబ్ సభ్యులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ పొందిన ఏడుగురు పోలీసు అధికారులకు ఘనంగా సన్మానం



**నేరేడ్ మెట్, జూలై 31, (తెలంగాణ దిశ) :**రాచకొండ పోలీస్ కమిషనరేట్ లో పనిచేస్తూ గురువారం పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులు టివి హనుమంతరావు, ఎం. సుగుణ, మహమ్మద్ షర్ఫుద్దీన్, డి. రామకృష్ణ, మహమ్మద్ ఫైజుద్దీన్, వి. సాగర్ రావు, మహమ్మద్ షంషీర్ ఖాన్ లకు సీపీ సుధీర్ బాబు రాచకొండ పోలీస్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని, విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ ఎంతో కాలం పాటు పోలీసు శాఖలో సమర్థవంతంగా, క్రమశిక్షణతో పనిచేసి తమ సేవలు అందించినందుకు అభినందించారు. పదవీ విరమణ అనంతరం విశ్రాంత జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని, ఆరోగ్యం పట్ల అధిక శ్రద్ధ చూపాలని, పెన్షన్, ఇతర ఆర్థిక అంశాల పట్ల క్రమశిక్షణ పాటించాలని సూచించారు. వారికి రావాల్సిన అన్ని రకాల ప్రయోజనాలు త్వరగా వచ్చే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పదవీ విరమణ పొందే అధికారులు, సిబ్బంది సంక్షేమం కోసం తాను ఏర్పాటు చేసిన పెన్షన్ డెస్క్ ద్వారా త్వరగా పెన్షన్ మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ ఇందిరా, డిసిపి ఎస్ బి జి. నరసింహ రెడ్డి, అడిషనల్ డీసీపీ అడ్మిన్ శివ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఎసిపి రవీందర్ రెడ్డి, సీఏఓ అడ్మిన్ పుష్పరాజ్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు సిహెచ్. భద్రా రెడ్డి, కృష్ణా రెడ్డి, టేకుల రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి




**కుత్బుల్లాపూర్, జూలై 31, (తెలంగాణ దిశ) :**భారత రాజ్యాంగం ద్వారా లభించిన పౌర హక్కులపై ప్రతీ పౌరుడికి అవగాహన ఉండాలని వక్తలు సూచించారు. గురువారం చింతల్ డివిజన్ లో పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించారు. ప్రతి పౌరుడు సమానంగా, చట్టం ముందు సమాజం లో గౌరవంగా ఉండటానికి హక్కులు కలిగి ఉంటారని తెలిపారు. ఈ సమావేశంలో కుత్బుల్లాపూర్ రెవెన్యూ ఇన్ స్పెక్టర్ ఎండి, ఖలీమ్ ఆధ్వర్యంలో గట్టు అశోక్ అధ్యక్షతన సమావేశం జరిగింది%ఎ% ఈ సమావేశంలో జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి, జీడిమెట్ల ఇన్ స్పెక్టర్ మల్లేష్, సివిల్ సప్లయి అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎలక్ట్రికల్ ఏఈ స్వామి, సోషల్ వెల్ఫేర్ అధికారిని ప్రమీల, ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ భవాని, విజయ, దళిత నాయకులు రామడుగు సిద్దయ్య, సివి రత్నం, మాచనపల్లి బుచ్చన్న, మేకల ఎల్లయ్య, సత్యనారాయణ, జై భీమ్, మహాసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజన్న, డేవిడ్, భగత్ సింగ్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ లక్ష్మారెడ్డి, వల్లభ శ్రీనివాస్, శ్రీకాంత్, శ్రీనాథ్, వెంకటేష్, మల్లేష్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల పరిరక్షణకు హైడ్రా చర్యలు తీసుకోవాలి

## - ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**ఉప్పల్, జూలై 31, (తెలంగాణ దిశ) :**ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని చెరువుల పరిరక్షణకు హైడ్రా చర్యలు తీసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గురువారం హైడ్రాకమిషనర్ ఏవీ రంగనాథ్ కోరారు. కాప్రా, నాచారం డివిజన్ పరిధిలోని కాప్రా, హెచ్ఎంటి నగర్ చెరువు, పటేల్ కుంట, రామంతాపూర్ పెద్ద చెరువు, చిన్న చెరువుల్లో సుందరీకరణ పూడిక తీత గురించి చర్చించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. త్వరలోనే వచ్చి అన్ని చెరువులు చూసి పనులు ప్రారంభిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గ్రేటర్ నాయకులు సాయి జెన్ శేఖర్, గంధం నాగేశ్వర్ రావు, బైరీ నవీన్ గౌడ్, నేమూరి మహేష్ గౌడ్ కాలేరు నవీన్, ఇంద్రయ్యా, జెట్ట కిషోర్, భాషపల్లి నిరంజన్ చారి, రాంరెడ్డి, ఉపేందర్, కట్ట బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## బిగ్ గేమ్..!

బిహార్.. ఉత్తర భారత దేశంలో అతిపెద్ద రాష్ట్రాల్లో ఇదీ ఒకటి. ఇక్కడ బీజేపీ, జేడీయూ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలో ఉంది. నితీశ్‌కుమార్ వరుసగా 15 ఏళ్లు సీఎంగా ఉన్నారు. ఈ ఏడాది చివరలో బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈసారి బిహార్‌లో ఎన్డీఏ అదికారంలో రాకుండా చేయడమే లక్ష్యంగా విపక్ష కాంగ్రెస్, ఆర్జేడీ, జన్ సురాజ్ పార్టీ ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ క్రమంలో మహారాష్ట్రలో హిందీ వ్యతిరేక నిరసనలు, ఏడీఆర్ ఎన్నికల సంస్కరణల వ్యతిరేకత, నార్వే రాయబారితో కిశోర్ సమావేశం రాజకీయ కుట్రల చర్చను రేకెత్తిస్తున్నాయి.కాంగ్రెస్, ఆర్‌జేడీలతో కూడిన ఇండియా కూటమి బిహారీ గుర్తింపు, సామాజిక న్యాయ ఎజెండాతో ముస్లిం, యాదవ, ఓబీసీ, ఈబీసీ ఓట్లను లక్ష్యంగా చేసుకుంది. ప్రశాంత్ కిశోర్ జన్ సురాజ్ పార్టీ అగ్రకులాల ఓట్లను చీల్చడంతోపాటు యువత, నిరుపేదలను ఆకర్షిస్తోంది. కిశోర్ జేడీయూ 25 సీట్లు దాటదని, నితీశ్ కుమార్ మళ్లీ సీఎం కాబోదని సవాల్ విసిరారు. ఇండియా కూటమి సామాజిక న్యాయ ఎజెండాతో బలమైన ఓటు బ్యాంకును ఏర్పరచగలదు. ఈ క్రమంలోనే కీలక పరిణామాలు జరుగుతున్నాయి మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే (శివసేన యూబీటీ), రాజ్ ఠాక్రే (ఎంఎన్ఎస్) హిందీని మూడో భాషగా పరిచయం చేసే ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించి, 20 ఏళ్ల తర్వాత కలిశారు. ఈ నిరసనలు మహాయుతి (బీజేపీ?శివసేన) ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, హిందీ విధానాన్ని రద్దు చేయించాయి. బిహారీలపై దాడులు ఈ నిరసనలతో ముడిపడి ఉన్నాయనే అనుమానం ఉంది. ఈ నిరసనలు బీజేపీకి రాజకీయ నష్టం కలిగించి, బిహార్ ఎన్నికల్లో బిహారీ గుర్తింపును లేవనెత్తే ఇండియా కూటమి వ్యూహానికి సహకరిస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రశాంత్ కిశోర్‌తో నార్వే రాయబారి సమావేశం కొత్త చర్చకు దారితీసింది. నార్వే గతంలో లిబియా, ఇథియోపియా, శ్రీలంకలో ప్రభుత్వాల మార్పుకు సంబంధించిన కార్యకలాపాల్లో పాల్గొన్న చరిత్ర ఉంది. ఈ సమావేశం ఎన్డీఏను ఓడించే కుట్రలో భాగమనే ఊహాగానాలు ఉన్నాయిఅసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) బిహార్‌లో ఓటరు జాబితా సవరణను వ్యతిరేకిస్తోంది, దీనిని ఎన్డీఏ ఆమోదించింది. గతంలో ఎన్నికల బాండ్ల రద్దు, రఫేల్ వివాదంలో బీజేపీని లక్ష్యంగా చేసుకున్న ఏడీఆర్, ఇండియా కూటమికి మద్దతుగా పనిచేస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. ఏడీఆర్ వ్యతిరేకత ఓటరు జాబితా సవరణను దళిత, ఓబీసీ, మైనారిటీ ఓటర్లకు వ్యతిరేకమైన చర్యగా చిత్రీకరిస్తోంది. ఇది ఇండియా కూటమికి రాజకీయంగా లాభిస్తుంది.ఎన్డీఏలో బీజేపీ 74 సీట్లతో బలంగా ఉన్నప్పటికీ, జేడీయూ 43 సీట్లతో బలహీనంగా ఉంది. చిరాగ్ పాశ్వాన్ లోక్ జనశక్తి పార్టీ 243 సీట్లలో పోటీ చేస్తామని ప్రకటించి, ఎన్డీఏ ఓట్లను చీల్చే అవకాశం ఉంది. బిహార్‌లో ఎన్డీఏను ఓడించేందుకు కాంగ్రెస్, ఆర్‌జేడీ, జన్ సురాజ్ వ్యూహాత్మక కదలికలు సాగిస్తున్నాయి. మహారాష్ట్రలో హిందీ వ్యతిరేక నిరసనలు, ఏడీఆర్ ఎన్నికల సంస్కరణల వ్యతిరేకత, నార్వే రాయబారి సమావేశం రాజకీయ కుట్రల చర్చను రేకెత్తిస్తున్నాయి. ఎన్డీఏలో అంతర్గత కలహాలు, చిరాగ్ పాశ్వాన్ స్వతంత్ర వైఖరి ఇండియా కూటమికి అవకాశం కల్పిస్తున్నాయి. అయితే, విదేశీ జోక్యం ఆరోపణలకు ఆధారాలు అవసరం.. బీహార్ ఓటర్ల జాబితాలో అనేక మంది బంగ్లాదేశ్, నేపాల్, మయన్మార్ దేశస్తులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని ఈసీ వర్గాలు తెలిపినట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. మీడియా కథనాల ప్రకారం.. బంగ్లా, నేపాల్, మయన్మార్ దేశాలకు చెందిన అనేక మంది ప్రస్తుతం రాష్ట్రంలో నివాసముంటున్నారని సర్వేలో తేలింది.వారంతా ఆధార్ కార్డులు, నివాస ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులు లాంటి వాటిని అక్రమ మార్గాల ద్వారా పొందినట్లు సమాచారం. సర్వే చేస్తున్న క్షేత్రస్థాయి అధికారులు ఇలాంటి వారిని అనేక మందిని గుర్తించినట్లు తెలుస్తోంది. అక్రమ ఓటర్ల పేర్లను ఆగస్టు 1 నుంచి 30 వరకు గుర్తించి జాబితా నుంచి తొలగించనున్నట్లు ఈసీ వర్గాలు తెలిపాయి. అనర్హులు, నకిలీ ఓటర్లతోపాటు విదేశీయులను ఓటర్ల జాబితా నుంచి తొలగించేడమే లక్ష్యంగా ఈ సర్వే ప్రారంభించినట్లు ఈసీ చెబుతోంది.కాగా ఇలాంటి సర్వేను చివరిసారిగా 20 ఏళ్ల క్రితం చేశారు. అప్పటి నుంచి అనుబంధ సవరణలు మాత్రమే చేపడుతున్నారు. కాగా అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలలు ముందు ఈసీ ఈ ప్రక్రియను చేపట్టడంపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. ఓటర్ల జాబితా సవరణపై అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. ఈసీ చర్యను కోర్టు సమర్థించింది. రాజ్యాంగంబద్ధమైన ప్రక్రియగా పేర్కొంది. అయితే, ఈసీ ఎంచుకున్న టైమ్ పీరియడ్‌ను మాత్రం కోర్టు ప్రశ్నించింది. బిహార్ ఎన్నికలు రసవత్తరంగా మారినప్పటికీ, ఫలితాలే ఈ రాజకీయ ఆటలో విజేతను నిర్ణయిస్తాయి.

## కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకం

### - ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**కుషాయిగూడ, జూలై 31, (తెలంగాణ దిశ)** :కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్ కుషాయిగూడ శ్రీ సాయి కృష్ణ ఎన్ క్లేవ్ లో గురువారం జరిగిన కాలనీ సంక్షేమ సంఘం భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎంపల్లి పద్మా రెడ్డి,నాయకులు నేమూరి మహేష్ గౌడ్, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, గంప కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో శ్రీ సాయి కృష్ణ ఎన్ క్లేవ్ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. కాలనీ అభివృద్ధి కోసం అవసరమైన నిధులను మంజూరు అయ్యేలా చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. శ్రీ సాయి కృష్ణ ఎన్ క్లేవ్ సభ్యులు రామచంద్రారెడ్డి, తిరుమల్ రెడ్డి, వీణా, దేవి గీత తదితరులు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య అధ్యక్షులు ఎంపల్లి పద్మా రెడ్డి, నాయకులు నేమూరి మహేష్ గౌడ్, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, గంప కృష్ణ, బివి. నరసింహారెడ్డి, షేక్ అబ్దుల్ రహీమ్, తాళ్ల వెంకటేష్ గౌడ్, జై కృష్ణ, సంపత్, ప్రసాద్ రెడ్డి, చల్ల వెంకటేశ్, శేఖర్ నాయక్, బాలాజీ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలను నాటి భావితరాలకు స్వేచ్ఛా వాయువును అందజేద్దాం

### బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే వివేకానంద్





**కుత్బుల్లాపూర్, జూలై 31, (తెలంగాణ దిశ)** :రంగారెడ్డి నగర్ డివిజన్ ఎపిహెచ్ బి కాలనీలోని జిహెచ్ఎంసీ పార్క్ - 1 లో ఎపిహెచ్ బి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అటవీశాఖ వారు ఏర్పాటు చేసిన వన మహోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాలకు స్వేచ్ఛా వాయువును అందించేందుకు ప్రతీ ఒక్కరూ చెట్లను నాటడమే కాదు, వాటిని పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ విజయ్ శేఖర్ గౌడ్, డీసీ నర్సింహా, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రఘువీర్ రెడ్డి, హార్టికల్చర్ యూబీడీ దివ్య, సీఐ నరసింహ రాజు, ఎపిహెచ్ బి కాలనీ వాసులు ఎర్వ సాయికిరణ్ (బంటి), భాష, జగన్, రత్తయ్య, రమణయ్య, సుధాకర్ రావు, వెంకట్ రెడ్డి, ఓం ప్రకాష్, స్థానిక నాయకులు ఎర్వ శంకరయ్య, సుధాకర్, ఓంకార్ రెడ్డి, క్రాంతి యాదవ్, కార్తీక్ గౌడ్, సతీష్ గట్టోజీ, తారక రాణి, ఈశ్వరి, బాలు నేత, కొండ శ్రీను, గౌస్, అల్లావుద్దీన్, కిరణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారిత, అభివృద్ధిపై బాచుపల్లి పోలీసుల అవగాహన సదస్సు

**కుత్బుల్లాపూర్, జూలై 31, (తెలంగాణ దిశ)** :మహిళా సాధికారిత, అభివృద్ధి అవగాహన సదస్సు గురువారం నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ భవ్యస్ ఆనందం గేటెడ్ కమ్యూనిటీలో జరిగింది. ఈ సందర్భంగా సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల పోలీసులు, ఉమెన్స్ సేఫ్టీ వింగ్స్ ఆధ్వర్యంలో మహిళా సాధికారత, అభివృద్ధిపై సంస్థ నిర్వాహకులు స్థానిక మహిళలకు అవగాహన కల్పించారు. ప్రధానంగా గృహ హింస, కుటుంబ కలహాలు రాకుండా సూచనలు, ఒకవేళ తలెత్తితే పరిష్కారాల విషయమై మహిళలకు అవగాహన కల్పించారు. సమాజంలో పెరిగిపోతున్న సైబర్ క్రైమ్స్ పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్ పి భాస్కర్ రెడ్డి, డాక్టర్ మోదులే, బాచుపల్లి ఎస్ ఐ రాజశేఖర్ రెడ్డి, బాచుపల్లి ఎస్ ఐ సంధ్య, ప్రోగ్రాం మేనేజర్




వి. అనూష, (సిడిఈడబ్ల్యూ సెంటర్), భవ్యస్ ఆనందం నిర్మాణ సంస్థ నుండి సీతారాం, భవ్యస్సు ఆనందం అసోసియేషన్ అధ్యక్షురాలు రమణి, బాచుపల్లి సిడిఈడబ్ల్యూ ఫ్యామిలీ కౌన్సిలింగ్ కు చెందిన అధికారులు, సిబ్బంది, బాచుపల్లి పోలీసులు, భవ్యస్ ఆనందం కమ్యూనిటీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## క్లూస్ పరికరాల ఫోరెన్సిక్ వ్యాన్ పరిశీలించిన రాచకొండ సిపి సుధీర్ బాబు



**నేరేడ్ మెట్, జూలై 31, (తెలంగాణ దిశ)** :అత్యాధునిక క్లూస్ పరికరాలు పొందుపర్చిన ఫోరెన్సిక్ వ్యాన్ ను గురువారం రాచకొండ సిపి సుధీర్ బాబు నేరేడ్ మెట్ లోని కమిషనర్ కార్యాలయం ప్రాంగణంలో గురువారం పరిశీలించారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నుంచి కొత్త చట్టాలకు అనుకూలంగా మొబైల్ ఫోరెన్సిక్ వ్యాన్ ను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రాచకొండకు కేటాయించారు. అడిషనల్ డీసీపీ శ్యామ్ సుందర్, ఆడిషనల్ డీసీపీ అడ్మిన్ శివకుమార్, సిసిఆర్బి ఏసిపి రమేష్, ఆర్ఐ సుభాన్ గౌడ్, క్లూస్ టీమ్ ఇన్ స్పెక్టర్ అనిల్,



క్రైమ్ సీన్ ఆఫీసర్ నీలిమ, ఎస్ ఐ ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

## కీసరలో కన్నుల పండువగా వనమహోత్సవం






**కీసర, జూలై 31, (తెలంగాణ దిశ)** :తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వంద రోజుల కార్యక్రమంలో భాగంగా కీసరలో గురువారం వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఆర్. పుష్పలత, కీసర ఆర్డీఓ వెంకట ఉపేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థినీ విద్యార్థులు వన మహోత్సవంలో పాల్గొని పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. కీసర వార్డు కార్యాలయ ప్రాంగణంతో పాటు బోగారం రోడ్డులోని తటాకం వెంచర్ లో జమ్మి చెట్టు దగ్గర 850 మొక్కలు నాటడంతో పాటు మరో 2180 మొక్కలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఈఈ ఎస్. బాల మురళి, సానిటరీ ఇన్ స్పెక్టర్ ప్రభు, మాజీ ప్రజా ప్రతినిధులు, వార్డు ఆఫీసర్లు, కార్యాలయ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, ఆశ వర్కర్లు, స్నేహా మహిళా సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిలో వెలసిన షెడ్లను తొలగించాలి



**కుత్బుల్లాపూర్, జూలై 31, (తెలంగాణ దిశ)** : నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి గ్రామం సర్వేనెంబర్ 212 ప్రభుత్వ స్థలంలో లో వెలిసిన రేకుల షెడ్లను తక్షణమే తొలగించి స్థలాన్ని కాపాడాలని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు మల్యాల రమణి గురువారం బాచుపల్లి తాహసిల్దార్ పూల్ సింగ్ కు ఫిర్యాదు చేశారు..

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ అవసరాల కోసం భవిష్యత్తులో చాలా ఇబ్బందికరమైన పరిస్థితులు నెలకొంటాయని అన్నారు. తక్షణమే సర్వేనెంబర్ 212 లో తెలిసిన షీట్లను తీసివేసి ఆ స్థలానికి ఫెన్సింగ్ వేసి రెవెన్యూ ఆధీనంలోకి తెచ్చుకోవాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా బాచుపల్లి తాహసిల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని అన్నారు. నూతనంగా వెలిసిన షెడ్లను తీసివేసి స్థలాన్ని కాపాడతామని హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు.

## సమ్మక్క సారలమ్మ జాతరకు రైల్వే లైన్ ఏర్పాటు చేయాలి : ఎంపీ ఈటల



**మల్కాజిగిరి, జూలై 31, (తెలంగాణ దిశ)** :సమ్మక్క సారలమ్మ జాతరకు రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని రూల్ 377 కింద మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పార్లమెంట్ లో ప్రస్తావించారు. ములుగు జిల్లా మేడారం గ్రామంలో సమ్మక్క సారలమ్మ జాతర ప్రతి రెండు సంవత్సరాలకు ఒక సారి జరుగుతుందన్నారు. ఇది ఏషియాలోని అతిపెద్ద గిరిజన పండుగని, తెలంగాణ ఛత్తీస్ ఘడ్, మహారాష్ట్ర, ఒరిస్సా నుంచి కోటి మంది భక్తులు జాతరకు వస్తారని తెలిపారు. ఇంత పెద్ద సంఖ్యలో వస్తున్న భక్తులకు రైల్వే లైన్ లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

## ఘనంగా సాయిబాబా మందిర్ 17వ వార్షికోత్సవ వేడుకలు



**నాగారం, జూలై 31 (తెలంగాణ దిశ)** :నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు సత్యనారాయణ కాలనీ లో సాయిబాబా మందిర్, శ్రీ పోచమ్మ దేవస్థానం, శ్రీ భవాని శంకరా స్వామి దేవస్థానం, శ్రీ రమ రహిత సత్యనారాయణ స్వామి ఆలయం 17వ వార్షికోత్సవ కార్యక్రమం గురువారం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, అన్నంరాజు శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మల్లాపూర్ లో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



**మల్లాపూర్, జూలై 31, (తెలంగాణ దిశ)** :కాప్రా సర్కిల్ మల్లాపూర్ డివిజన్ పరిధిలోని సూర్య నగర్, జనప్రియ టౌన్ షిప్ లలో బీటీ రోడ్ల నిర్మాణానికి రూ. 65 లక్షలు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మల్లాపూర్ లో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ గ్రేటర్ నేత నెమిలి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు.

సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ఉప్పల్ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పిజి. సుదర్శన్, టి. శ్రీకాంత్ రెడ్డి, కె. రాజేష్,

బెల్లం శ్రీనివాస్, కె. సాయి కిరణ్ గౌడ్, వి. శ్రీనివాస్, బాల్ రాజ్ గౌడ్, జోష్, మహేష్ నాయక్, ప్రభాకర్ రెడ్డి, ఫసియుద్దీన్, మని, పర్వతా లు,మల్లు, కె. సురేష్ గౌడ్, ఎం. జయంత్ గౌడ్, వంగవీటి ప్రిన్కు, గడ్డం వినీష్ యాదవ్, పాషా, వెంకట్, రాకేష్, నజ్మా, సోనీ,ఇష్రాత్ బాను, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అటవీశాఖ అధికారుల దౌర్జన్యాన్ని నిరసిస్తూ ఐటిడిఏ ఎదుట పోడుదారుల నిరసన





**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 31, (తెలంగాణ దిశ)** :చర్ల మండలంలోని కుదునూరు, దేవరపల్లి గ్రామంలో సాగు చేసుకుంటున్న పోడు భూములపై అటవీ శాఖ అధికారులు దాడులను నిర్వహించి పంటలను ధ్వంసం చేయడానికి నిరసిస్తూ భద్రాచలం ఐటీడీఏ ఎదుట గురువారం ఆదివాసీ గిరిజనులు ధర్నా చేశారు. ఆదివాసీలు సాగు చేసుకుంటున్న భూములపై అటవీ శాఖ అధికారులు దౌర్జన్యంగా ప్రవేశించి వారు వేసిన పంటను నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీశాఖ అధికారులు పీకి పడేసిన మొక్కలతో భద్రాచలం ఐటిడిఏ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని నిరసన తెలిపారు.

# వర్షాకాలం సందర్భంగా జిహెచ్ఎంసి పారిశుద్ధ్య సిబ్బంది స్పెషల్ డ్రైవ్





**ఏఎస్ రావునగర్, జూలై 31, (తెలంగాణ దిశ)** :వర్షాకాలం సందర్భంగా జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ పారిశుద్ధ్య సిబ్బంది గురువారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టారు. అశోక్ నగర్, శ్రీనివాస్ నగర్, ఏఎస్ రావునగర్ పార్క్ లో చెత్తా చెదారాన్ని తొలగించి వేశారు. దోమల నివారణకు మందు పిచికారీ చేశారు. ఆగస్టు 8 వరకు ప్రత్యేక పారిశుద్ధ కార్యక్రమం కొనసాగిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాప్రా డిసి జగన్, ఈఈ నాగేందర్, డిఈ బాలకృష్ణ, టౌన్ ప్లానింగ్ డిసిపి కృష్ణమోహన్, ఎంటామాలజీ ఏఈ రమేష్, శానిటరీ సూపర్ వైజర్ సుదర్శన్, డిపిఓ దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎంబీబీఎస్ విద్యార్థినీ చదువు కోసం బిఎల్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.40 వేల ఆర్థిక సహాయం

**నాచారం, జూలై 31, (తెలంగాణ దిశ)** :సినీ నిర్మాత, ఫిల్మ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ దిల్ రాజు చేతుల మీదుగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్ ట్రస్ట్) ఆధ్వర్యంలో ఎంబిబిఎస్ విద్యార్థిని బొల్లి ఆశాజ్యోతికి రూ. 40 ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. భాస్కర మెడికల్ కాలేజ్ లో ఎంబిబిఎస్ చదువుతున్న ఆశాజ్యోతి ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న ఉప్పల్ శాసనసభ్యుడు బండారు లక్ష్మారెడ్డి ఎంబీబీఎస్ కి అయ్యే ఫీజు రూ. 40 వేల చెక్కును ఆమెకు నాచారంలో అందజేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ఎవరైనా ఎంబీబీఎస్ సీటు సాధిస్తే ఫీజు మొత్తం తానే చెల్లిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్



పార్టీ గ్రేటర్ నాయకులు సాయి జెన్ శేఖర్, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ లో బోనాల బందోబస్తు పర్యవేక్షించిన రాచకొండ సిపి





**ఉప్పల్, జూలై 31, (తెలంగాణ దిశ)** :ఉప్పల్ లో బోనాల బందోబస్తును రాచకొండ సిపి సుధీర్ బాబు గురువారం పర్యవేక్షించారు. అదేవిధంగా ఉప్పల్ పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. అనంతరం సీసీ కెమెరాలు పరిశీలించి అధికారులకు జాగ్రత్తలు సూచనలు చేశారు. ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బోనాలు జరుగుతున్న సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

# రాజాసింగ్.. లక్ష్మణ్.. నెక్ట్స్ ఎవరు?

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** బీజేపీ అంటేనే క్రమశిక్షణ గల పార్టీ. అధికారం కోసం, పదవుల కోసం కాకుండా సిద్ధాంతం కోసం పనిచేసే కార్యకర్తలు ఉంటారు. కానీ, మోదీ ప్రధాని అయ్యాక దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి వచ్చింది. ఇందుకోసం బీజేపీ వివిధ పార్టీల్లోని కీలక నాయకులను చేర్చుకుంది. దీంతో పార్టీ సిద్ధాంతం పక్కకుపోయింది. దీంతో పాత కొత్తల కలయిక కొన్ని రాష్ట్రాల్లో పార్టీకి ఇబ్బందిగా మారుతోంది. తెలంగాణలో కూడా అదే పరిస్థితి నెలకొంది. ఇందుకు మొన్న రాజీసింగ్, ఈ రోజు లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలే నిదర్శనం.తెలంగాణలో 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రిగా చేస్తామని హామీ ఇచ్చింది. ప్రధా మోదీ స్వయంగా ప్రకటించారు. ఈ ప్రకటన రాజకీయ చర్చకు దారితీసింది. ఈ క్రమంలో తాజాగా బీజేపీ నేత కె.లక్ష్మణ్, ఇతర రాష్ట్రాల్లో బీసీలను ముఖ్యమంత్రులుగా నియమించిన చరిత్రను గుర్తు చేస్తూ, ఈ హామీని పునరుద్ఘాటించారు. అదే సమయంలో, ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా, దానిని జాతీయ నాయకత్వం ఆమోదించడం కూడా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.బీజేపీ తెలంగాణలో బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రిగా నియమిస్తామని 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రకటించింది. ఈ హామీని పునరుద్ఘాటిస్తూ, బీజేపీ నేత కె.లక్ష్మణ్, ఇతర రాష్ట్రాల్లో బీసీ నేతలను ముఖ్యమంత్రులుగా చేసిన చరిత్రను ఉదాహరణగా చూపారు. ఈ ప్రకటన తెలంగాణలో బీసీ ఓటర్లను ఆకర్షించే లక్ష్యంతో చేసిన రాజకీయ వ్యూహంగా కనిపిస్తుంది, ఎందుకంటే రాష్ట్రంలో బీసీలు జనాభాలో సగానికి పైగా ఉన్నారు. బీసీ ఓటర్లు రాజకీయంగా నిర్ణయాత్మక శక్తిగా ఉన్నారు. బీజేపీ ఈ హామీ ద్వారా బీసీ సమాజాన్ని ఏకతాటిపైకి తెచ్చి, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలతో పోటీ పడేందుకు ప్రయత్నిస్తోంది. అయితే, ఈ హామీ నిజమైన నిబద్ధతను ప్రతిబింబిస్తుందా లేక ఎన్నికల వ్యూహంగా మాత్రమే పరిమితమవుతుందా అనేది చర్చనీయాంశం.గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామాను రాష్ట్ర బీజేపీ జాతీయ నాయకత్వానికి పంపింది, దానిని జాతీయ నాయకత్వం ఆమోదించింది. ఈ రాజీనామా బీజేపీలో అంతర్గత ఇబ్బందులను సూచిస్తుంది. రాజాసింగ్ రాజీనామా వెనుక బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహించే ఉద్దేశం ఉందా లేక ఇతర రాజకీయ కారణాలు ఉన్నాయా అనేది స్పష్టంగా తెలియలేదు. ఈ రాజీనామా బీసీ సీఎం హామీతో నేరుగా సంబంధం కలిగి ఉందా అనేది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.కె.లక్ష్మ ణ్, బీజేపీ ఇతర రాష్ట్రాల్లో బీసీలను ముఖ్యమంత్రులుగా నియమించిన చరిత్రను ఉదహరించారు. ఉదాహరణకు, ఉత్తరప్రదేశ్‌లో కల్యాణ్ సింగ్, బిహార్‌లో నితీష్ కుమార్ (సంబంధిత సమయంలో బీజేపీ మిత్రపక్షం) వంటి బీసీ నేతలు ముఖ్యమంత్రులుగా పనిచేశారు. తెలంగాణలో కూడా బీజేపీ గతంలో బీసీ నేతలైన చలపతిరావు, బండారు దత్తాత్రేయ, బండి సంజయ్‌లను రాష్ట్ర అధ్యక్షులుగా నియమించింది.

అయితే బీఆర్ఎస్, కాంగ్రెస్ మాత్రం తాజాగా బీసీకి అధ్యక్ష పగ్గాలు అప్పగించకపోవడాన్ని తప్పు పడుతున్నాయి రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీజేపీ బీసీలపై "మొసలి కన్నీరు" కారుస్తోందని, రాష్ట్ర అధ్యక్ష పదవిని బీసీలకు ఇవ్వలేదని ప్రశ్నించారు.ఇదిలా ఉంటే.. బీజేపీ అధ్యక్ష పగ్గాలు ఆ పార్టీలో అంతర్గత ఒత్తిడికి దారితీసినట్లు తెలుస్తోంది.గతంలో బీసీ నేతలైన ఈటల రాజేందర్, డీకే.అరుణ, ధర్మపురి అర్వింద్ వంటి వారిని ప్రముఖ పదవులకు పరిగణించినప్పటికీ, రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం బీసీ నేతను ఎంపిక చేయకపోవడం విమర్శలకు దారితీసింది. ఈ క్రమంలో బీసీ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా, తాజాగా ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ బీసీ ముఖ్యమంత్రి అంటూ చేసిన వ్యాఖ్యలు అసలు బీజేపీలో ఏం జరుగుతోంది అన్న చర్చకు దారితీశాయి.

# కళింగ వివాదం...

**శ్రీకాకుళం,తెలంగాణ దిశ :** బరిలో నిలిచిన తొలిసారి ఎమ్మెల్యే.. ఆపై మంత్రి.. మరి ఆ నేత ఎలా ఉండాలి? ఎలా నిలదొక్కుకోవాలి? అరుదైన అవకాశాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలి?.. కానీ సదరు నేత తనకంటూ ఒక సొంత టీం ను ఏర్పాటు చేసుకోవాలని భావించారు. తన గెలుపు కోసం కృషి చేసిన సీనియర్లను పక్కనపెట్టి జూనియర్లకు అవకాశం ఇచ్చారు. ఒక ప్రైవేటు సైన్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అయినా సరే ఓటమి ఎదురయింది. ఇప్పుడు అదే ఓటమి నుంచి అతనిపై తిరుగుబాటు ప్రారంభం అయ్యింది. ఎట్టి పరిస్థితుల్లో ఆ నేతను తప్పించాల్సిందేనన్న డిమాండ్ తెరపైకి వచ్చింది. పతాక స్థాయికి చేరుతోంది. ఇంతకీ ఎవరు ఆ నేత? ఏంటా కథ అంటే?.. శ్రీకాకుళం జిల్లాకు( చెందిన మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పై సొంత పార్టీ నేతలే తిరుగుబాటు చేయడం హాట్ టాపిక్ అవుతోం ది. శ్రీకాకుళం జిల్లా రాజకీయాల్లో పలాస నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం. 2009లో ఆవిర్భవించింది ఈ నియోజకవర్గం. ఇప్పటివరకు నాలుగు ఎన్నికలు జరిగాయి. రెండుసార్లు గౌతు కుటుంబీకులే ప్రాతినిధ్యం వహించారు. 2009 వరకు సోంపేట నియోజకవర్గం గా ఉండగా.. పునర్విభజనతో పలాస నియోజకవర్గంగా అవతరించింది. అయితే సోంపేట నియోజకవర్గంలో వరుసగా దశాబ్దాల కాలం గౌతు కుటుంబం హవా నడుస్తూ వచ్చింది. సర్దార్ గౌతు లచ్చన్న కుమారుడు శివాజీ సుదీర్ఘకాలం ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చారు. కానీ 2009లో పలాసలో గౌతు శివాజీ హవాకు బ్రేక్ పడింది. మత్స్యకార వర్గానికి చెందిన జుత్తు జగన్నాయకులు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. 2014లో మాత్రం తిరిగి శివాజీ విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో తాను తప్పుకొని కుమార్తె శిరీష కు అవకాశం ఇచ్చారు. కానీ ఆమె ఓటమి చవి చూశారు. వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన యువ నేత డాక్టర్ సీదిరి అప్పలరాజు అనూహ్య విజయాన్ని సొంతం చేసుకున్నారు. 2018లో సుదీర్ఘకాలం పాదయాత్ర చేశారు వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి. ఆ సమయంలో అధినేత దృష్టిలో పడ్డారు ఈ యువ డాక్టర్ అప్పలరాజు. మత్స్యకార వర్గానికి చెందిన అప్పలరాజు అయితే గౌతు కుటుంబ హవాకు చెక్ చెప్పవచ్చని పలాస నియోజకవర్గంలోని వైయస్సార్ కాంగ్రెస్ నాయకులు అధినేత దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జగన్మోహన్ రెడ్డి అప్పలరాజును సాదరంగా ఆహ్వానించారు. పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి బాధ్యతలు కట్టబెట్టారు. ఎమ్మెల్యే టికెట్ కూడా ఇచ్చారు. మత్స్యకార వర్గానికి చెందిన మోపిదేవి వెంకటరమణ ఏపీ క్యాబినెట్లో కొనసాగుతు ఒడగా ఆయనకు రాజ్యసభకు పంపించారు జగన్మోహన్ రెడ్డి. అదే సామాజిక వర్గానికి చెందిన అప్పలరాజు దూకుడును గుర్తించిన జగన్ క్యాబినెట్ లోకి తీసుకున్నారు. అంతవరకు కథ బాగానే నడిచింది. కానీ అక్కడి నుంచే అప్పలరాజు ఆలోచనలు మారాయి.పలాస నియోజకవర్గంలో తన గెలుపునకు, తన ఉన్నతికి సహకరించిన సీనియర్లను పక్కన పెట్టారు అప్పలరాజు. యువ నేతలతో సొంత టీం ఏర్పాటు చేసుకున్నారు. సోషల్ మీడియా సైన్యాన్ని నమ్ముకున్నారు. ఒంటెద్దు పోకడలతో చాలామంది సీనియర్లను దూరం చేసుకున్నారు. అప్పట్లోనే సీనియర్లు తిరుగుబాటు చేసి అప్పలరాజు అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించారు. కానీ జగన్మోహన్ రెడ్డి మాత్రం అప్పలరాజు పై నమ్మకం పెట్టుకుని టికెట్ ఇచ్చారు. తీవ్ర వ్యతిరేకతతో 42 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు అప్పలరాజు. అందుకే ఇప్పుడు సామాజిక స్లోగన్ తో ముందుకు వస్తున్నారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోని సీనియర్లు. 2029 లో పలాస నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ టికెట్ ను కళింగ సామాజిక వర్గానికి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు నేతృత్వంలో మూడు మండలాల సీనియర్ నేతలు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. సొంతంగా వారే వైయస్సార్ కాంగ్రెస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అప్పలరాజును ఎట్టి పరిస్థితుల్లో తప్పించాల్సిందేనని తేల్చి చెబుతున్నారు. చూడాలి అధినేత జగన్మోహన్ రెడ్డి ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో..!

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల 45 వసంతాల పూర్వ విద్యార్థుల భేటి లో పాల్గనండి

**-మంథని విద్యార్థి యువత అధ్యక్షులు కొండేల మారుతి**

**మంథని,తెలంగాణ దిశ :** మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాల 45 వసంతాల వేడుకలు విజయ వంతం చేయాలని పూర్వ విద్యార్థులకు మంథని విద్యార్థి యువత అధ్యక్షులు, పూర్వ విద్యార్థుల అధ్యక్షుడు కొండేల మారుతి పిలుపునిచ్చారు.మంథనిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటైన 45 వసంతాల నేపథ్యంలో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం నిర్వహించేందుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సన్నాహక సమావేశాన్ని పూర్వ విద్యార్థుల అధ్యక్షుడు కొండేల మారుతి అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమ ముఖ్య అతిథిగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జై కిషన్ ఓ ఝా హాజరై సమ్మేళన అహ్వాన పత్రకలను ఆవిష్కరించి తమ వంతు సహకారం అందజేస్తామన్నారు.ఈ సందర్భంగా కొండేల మారుతి మాట్లాడుతూ నలుబది ఐదు వసంతాల వేడుకలను సాహిత్య సాంస్కృతిక క్రీడా విజ్ఞాన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కళాశాలలో డిగ్రీ చదువుకున్న వారిలో 1111 మంది పూర్వ విద్యార్థుల ను సమీకరించ నున్నామన్నారు. కళాశాల విద్యారంగ అభివృద్ధికి అందరం సమిష్టి కృషి చేయాలనీ పిలుపు నిచ్చారు. 1981/2025 మధ్య కాలం లో ఇక్కడ పనిచేసిన భోధన సిబ్బందిని, చదువుకున్న వారై వృత్తి హెూ దాలలో సమున్నతులైన వారినీ సముచిత తరహాలలో సత్కరించుకునే కార్యాచరణ సిద్దమైనట్టు మారుతీ తెలిపారు.అపూర్వ ఆత్మీయ సమ్మేళనం విజయా బావుటాకు సహయ సహాకారాలను అందిస్తామని లెక్చరర్స్ పర్షయ్య, కర్నాటి కృష్ణ, అడేపు సతీష్, ఆడేపు లక్ష్మీ నారాయ ణ, తిరుపతి లు తమ ప్రసంగాలలో పేర్కొన్నారు.45 వసంతాల నిర్వహక భాధ్యులు గాయనీ కవియిత్రి వాన వామల అరుణాదేవి మాట పాట ల జోరుతో సమావేశం జరిగింది.ఈ కార్యక్రమం ఏర్పట్ల క్రమంలో మంథని విద్యార్థుల యువత స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయం అని ఆమే అన్నారు.

# పూర్తిస్థాయి సమీక్షతోనే?

దేశీయ విమానయాన రంగాన్ని ఒక కుదుపు కుదిపిన అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా బోయింగ్ 787 ప్రమాదంపై వెలువడిన ప్రాథమిక నివేదిక ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రమాదం జరిగిన దాదాపు నెల తరువాత వెలువడిన ఈ నివేదికలో పేర్కొన్న అంశాలపై జాతీయ స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ భిన్నాభిప్రాయాలు వెలువడుతున్నాయి. విచారణ పూర్తి కాకుండానే నివేదికను బహిర్గతం చేయడం, అందులో పైలట్ల తప్పు ఉందనిపించేలా కొన్ని వ్యాఖ్యలు ఉండటం పట్ల పైలట్ల సంఘం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. వివాదం తీవ్రమౌతుండటంతో ఇదే తుది నివేదిక కాదని, దీని ఆధారంగా ఎటువంటి నిర్ధారణకు రావద్దని, వ్యాఖ్యలు చేయవద్దని పౌర విమానయాన శాఖ కోరింది. గత నెల 12వ తేదీన జరిగిన ఈ ప్రమాదంలో 260 మంది మరణించిన సంగతి తెలిసిందే. దేశీయ విమానయాన చరిత్రలో జరిగిన అతి ఘోర ప్రమాదాల్లో ఒకటిగా ఈ దుర్ఘటన నిలిచింది.

విమానం గాల్లోకి ఎగిరిన కొద్ది నిమిషాల్లోనే ఇంజన్లకు ఇంధన సరఫరా ఒక్కసారిగా ఆగిపోవడం, మెడికల్ కళాశాల హాస్టల్ భవనాలపై కుప్ప కూలిపోవడం వంటి అంశాలు అత్యంత తీవ్రమైనవని, వీటిని సాధారణ సాంకేతిక లోపాలుగా పరిగణించడానికి ఎమాత్రం



వీలులేదని నిపుణులు అంటున్నారు. ఈ నేపథ్యంలోనే జాతీయ, అంతర్జాతీయ నిపుణులతో ఏర్పాటు చేసిన ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఎఎఐబి) ఇచ్చిన ప్రాథమిక నివేదిక ప్రాధాన్యత నంతరించుకుంది. కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లో నమోదైనట్టుగా పేర్కొన్న పైలట్ల సంభాషణ ప్రమాద సమయంలో నెలకొన్న గందరగోళ, భయానక పరిస్థితిని కళ్లకు కడుతోంది. ఈ నివేదికతో ఇంధన కాలుష్యం, పక్షులు ఢీకొనడం వంటి అంశాలు ఈ ప్రమాదానికి కారణం కాదని తేలినట్లు భావిస్తున్నారు. 15 పేజీల ఈ నివేదికలో ఇంజిన్ 1, ఇంజిన్ 2 యొక్క ఇంధన నియంత్రణ స్విచ్‌లు ఒక సెకను తేడాతో ఒక దాని తరువాత ఒకటి 'రన్' నుండి 'కట్‌ఆఫ్' స్థాయికి మారినట్లు (స్విచ్‌లు ఆఫ్ కావడంతో ఇంధన సరఫరా నిలిచిందని) పేర్కొనడం కలకలం రేపుతోంది. '3,505 మీటర్ల పొడవైన రన్‌వే నుండి ఎగరడం ప్రారంభించిన వెంటనే స్విచ్‌లు కట్ ఆఫ్‌కి మారాయి. దీంతో ఇంధన కొరత ఏర్పడింది' అని వివరించారు. ఈ సందర్భంగా పైలట్ల మధ్య చోటుచేసుకున్న సంభాషణను కూడా ప్రస్తావించారు.

స్విచ్‌లు ఎందుకు ఆఫ్ చేశావని ఒక పైలట్ ప్రశ్నిస్తుండగా, మరొకరు తాను ఆపలేదని చెబుతున్న విషయం వాయిస్ రికార్డర్‌లో నమోదైంది. దీని ఆధారంగానే పైలట్ల మీద సామాజిక మాధ్యమాల్లోనూ, ఇతరత్రా వస్తున్న ఆరోపణలపై పైలట్ల సంఘం స్పందించాల్సి వచ్చింది. ఇన్వెస్టిగేషన్ బ్యూరోలో పైలట్ల ప్రతినిధులు ఒక్కరు కూడా లేకపోవడాన్ని ఆ సంఘం తప్పు పట్టింది. అదే సమయంలో లాభాలను తమ ఖాతాల్లో వేసుకుని లోపాలను సిబ్బందిపై తోసివేసే పెట్టుబడిదారి వ్యవస్థ సహజ లక్షణాన్ని విస్మరించలేం. నిజానికి నివేదిక ప్రకారమే పైలట్ల సంభాషణ పూర్తిగా రికార్డు కాలేదు. ఇంత భయానక సంక్షోభ సమయంలోనూ ఇంజిన్లను పాక్షికంగా పనిచేసేటట్లు పైలట్లు చేయగలిగారని, అయితే, ఆ వెంటనే 'మే డే' పిలుపు ఇచ్చారని నివేదికలో పేర్కొనడం గమనా ర్హం.

# అప్పులు చేసిన వారికి శిక్షలు లేవా ?

గత పాలకుల ధోరణి కారణంగా ..ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అప్పులకుప్పగా మారింది. విభజన వల్ల జరిగిందిదే. రెండు కుటుంబాలు బాగు పడ్డాయి. రాష్ట్రాలు మాత్రం నీరసించాయి. ఈ అప్పులకు వడ్డీలు కట్టలేక మళ్లీ మళ్లీ అప్పులు చేస్తున్నారు. అప్పులు చేసి అభివృద్ధి చేస్తున్నామని చెప్పిన కెసిఆర్, జగన్ ఇద్దరూ రాష్ట్రాల ను దివాళా తీయించారు. దీనికి కేంద్రంలోని బిజెపి కూడా ఓ కారణం. అప్పులకుప్పగా రాష్ట్రాలు మారుతున్నా చోద్యం చూసిన మోడీ ప్రభుత్వం..ఇప్పుడు నీతి వాక్యాలు పలుకుతోంది. తెలంగాణలో అయితే బిజెపి నేతలకు వేరే పనేమి లేనట్లుగా విమర్శలతో కాలయాపన చేస్తున్నారు. కేంద్రంలో అంతా బ్రహ్మాండంగా చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటూ కాలం గడిపేస్తున్నారు. అప్పులు చేయకుండా రాష్ట్రాలను కట్టడి చేయడంలో పూర్తిగా విఫలం అయ్యారు. ఇలా పాలకులు ఇష్టానుసారం అప్పులు చేసి వెళితే దాని బాధ్యత ఎవరిదన్న చర్చ చేయాలి. జీతాలు సకాలంలో ఇవ్వలేక, అభివృద్ధి పనులు చేపట్టలేక, ఉన్నది ఉచితంగా దోచిపెడుతూ తామేదో ఘనకార్యం చేసామనుకుంటున్న కెసిఆర్, జగన్‌లు కళ్లు తెరిపించాలి. అసవరమైతే అందుకు వారిని బాధ్యతులను చేయాలి. చేసిన అప్పులకు శిక్షలు పడేలా చేయాలి. ఇకముందు రాజకీయ పార్టీలు, నేతలు ఇలా బాధ్యతా రహితంగా వ్యవహరించకుండా కట్టడి చేయాలి. ఇప్పటికైనా పథకాల కోసం కొత్తగా డబ్బుల వేట మొదలు పెట్టడం, అప్పులు చేయడం సరైనపని కాదని పాలకులు గుర్తించాలి. ఉన్న అప్పులను తీర్చడమెలా అన్నది పక్కన పెట్టి కొత్త అప్పులు చేయడమెలా అన్నదానిపైనా పాలకులు దృష్టి పెట్టడం దారుణం కాక మరోటి కాదు. పాలన అంటే పంచిపెట్టడం కాదని గుర్తించాలి. నగదు బదిలీలతో ప్రజలను మచ్చిక చేసుకుని ఓటు బ్యాంకు రాజకీయాలు చేసే పద్దతులు ఇకనుంచి పోవాలి. మరీ ముఖ్యంగా దుబారా పథకాలపై సమీక్షించాలి. ఇకపోతే వీరు చేసిన అప్పులకు తోడు మరిన్ని అప్పులు చేస్తున్నారే తప్ప ఉభయ తెలుగు రాష్ట్రాల సిఎంలు పద్దతి మార్చుకోవడం లేదు. వడ్డీలు కట్టలేక పోతున్నామని ఇద్దరు సిఎంలు అంటున్నారే తప్ప ఖర్చులు తగ్గించుకోవడం లేదు. ఏ రకంగా ఆదాయం పెంచుదామా, ఎలా ప్రజల నడ్డి విరుద్దామా అన్న ఆలోచనలే తప్ప..దుబారా పథకాలకు కళ్లెం వేయడం లేదు. సన్నబియ్యం అంటే కిలో రూపాయి బియ్యం, పెన్షన్లలో బోగస్ లబ్దిదారులను ఏరివేసే కార్యక్రమం చేయడం లేదు. ఇకపోతే విభజన వల్ల రెండు తెలుగు రాష్ట్రాలను కోలుకోకుండా చేసిన ఘనత కెసిఆర్, జగన్‌లకే దక్కుతుంది. ఈ ఇద్దరి కారణంగా విభజన లక్ష్యం వెనక్కి పోయింది. ఇద్దరూ గోబెల్స్‌ను మించి అభివృద్ధి పేరుతో అతిగా ప్రచారం చేశారు. ఇప్పుడేమో వాటిని మరచిపోయేలా ప్రజల్లో మళ్లీ సానుభూతి పొందేలా ఎదురుదాడి విమర్శలకు దిగుతున్నారు. సిగ్గూ ఎగ్గూ లేకుండా చేస్తున్న విమర్శలు చూస్తే మతిపోతుంది. ఇటు కెటిఆర్, హరీష్ రావు, కవితలు, అటు జగన్ ఆయన పరివారం అబద్దాల మూటలతో ప్రజలను వంచించే పనిలో పడ్డారు. ఎపిలో కనీసం 14.70 లక్షల కోట్లు అప్పుపెట్టి పోయారు జగన్ మహాశయులు. తెలంగాణలో కూడా ఏడులక్షల కోట్లను అప్పుగా పెట్టి పోయారు కెసిఆర్. ఇద్దరూ ఇద్దరే అన్నట్లుగా పాలన సాగించారు. అప్పులనుచి ఇప్పటి కిప్పుడు బయటపడడం సాధ్యం కాదు. రైతుభరోసా విషయంలో ఇప్పుడిప్పుడే తెలంగాణ ప్రభుత్వం సరైన అడుగులు వేస్తోంది. అర్హులకే ఇవ్వడంతో పాటు, గతంలో అప్పనంగా రైతుబంధు సాయం పొందిన వారి జాబితాను సిద్దం చేస్తోంది. దాదాపు 25వేల కోట్లు వృధా అయినట్లు చెబుతున్నారు. ఇలాంటి దుబారాకు సంబంధించి నిక్కచ్చిగా వ్యవహరిం చాల్సిందే. ఎందుకంటే ఆస్తుల మాట ఎలా ఉన్నా ఏటేటా రాష్ట్రాల్లో అప్పుల మూట పెరుగుతోంది. కొత్త కొత్త పథకాలతో ప్రజలకు దోచిపెడుతూ దానకర్ణుడిలా గొప్పులు చేసామని తెలుగు వల్లభులు కెసిఆర్, జగన్‌లు చాటుకున్నారు. చేతికి ఎముక లేదన్నట్లుగా పథకాలతో ఖజానాను ఊడ్చేసారు. ఇదంతా అభివృద్దిగా చూపుతూ..దేశమంతా ఇదే పాటించాలన్న డిమాండ్‌ను పెట్టారు. కిలో రూపాయి బియ్యం పక్కదారి పడుతున్నా.. తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, ఎపి సిఎం చంద్రబాబులకు పట్టడం లేదు. ఎన్ని రేషన్ కార్డులు ఉన్నాయి..ఎంతమంది పేదలు ఉన్నారు..ఎంతమంది కిలో బియ్యం వాడుతు న్నారన్నది గమనించడం లేదు. బియ్యం పక్కదారి పట్టి అమ్ముకుంటున్నా పట్టించుకోవడం లేదు. రూపాయికే కిలో బియ్యం అన్నది అర్థం లేని పథకంగా ఇప్పటికే గుర్తించాల్సింది. అయినా దానిని సమీక్షించడం లేదు. ఇలాంటి పథకాలు గుదిబండగా మారుతున్నాయి. ఓ రకంగా చెప్పాలంటే దళారీలకు దందాలు చేసే పథకంగా మారింది. ఉచిత విద్యుత్ కూడా ఇప్పుడు ఆందోళనలకు కారణం అవుతోంది. నిజానికి రైతులకు ఎంత ఉచిత విద్యుత్ అవసరమో లెక్కలేదు. ఎవరికి ఎంత పొలం ఉంది..వారికి ఎంత విద్యుత్ అసవరం.. వారు ఏ పంటలు పండిస్తున్నారో లెక్కలు తీయాలి. ఉచిత విద్యుత్ పొందుతున్న వారిలో ఎందరు పంటలు పండిస్తున్నారు.. ఏ పంటలు పండిస్తున్నారు..అన్న లెక్కలు కూడా లేవు. కొందరు ఇతరత్రా పనులకు ఉచిత విద్యుత్‌ను ఉపయోగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నిజానికి ఉచిత విద్యుత్‌ను కూడా లెక్కగట్టి ఇవ్వాలి. ఏ పంట పండిస్తారో చూడాలి. ప్రజలు పన్నుల రూపంలో కట్టిన డబ్బులతో విద్యుత్ కొని ఇస్తున్న ప్పుడు దానికి లెక్కా పత్రం ఉండాలి. ప్రజలను ఆదుకోవడం వేరు..ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం పథకాలను అమలు చేయడం వేరన్న పద్దతిలో పాలన సాగాలి. రైతుభరోసా కావచ్చు...ఇతర పథకాలు కావచ్చు..దుబారాను అరికట్టాలి. దూరదృష్టి లేకుండా పథకాల పేరుతో దుబారా చేస్తే నష్టపోయేది రాష్ట్రం.. ప్రజలే అని గుర్తించాలి. ముఖ్యంగా ఉభయ తెలుగు రాష్ట్ర సిఎంలు దీనిపై పాఠాలు నేర్చుకోవాలి. ఇబ్బడి ముబ్బడిగా పోటీపడి కొనసాగించిన ఉచిత పథకాలను రద్దు చేయాలి. రైతుబంధు, రైతు రుణమాఫీలు, ఉచిత గొర్రెల పథకం, దళితబంధు వంటి పథకాల ద్వారా లక్షల కోట్లు దుర్వినియోగం అయ్యాయి. విపక్షాలు కూడా విమర్శలు మాని ఈ పథకాలపై చర్చించి దుబారాను అరికట్టడానికి సహకరించాలి. మంచి సూచనలు ఇవ్వాలి. లేకుంటే వారు కూడా ఇందుకు బాధ్యులు కాగలరు. ఒక్కో పథకంలో ఎంతమంది పేదలు, అందులో అర్హులు ఉన్నారో లెక్కగట్టాలి. ప్రచారార్భాటాలు కాకుండా ప్రజలు తమంతగా తాము బాగు పడ్డామని చెప్పగలిగినప్పుడే సువరిపాలన అందించిన వారం అవుతాం.ప్రజలకునేరుగా డబ్బులు పందేరం అన్నది వారిని సోమరులను తయారు చేసే ప్రయత్నం మాత్రమే కాగలదు. ఎసి గదుల్లో కూర్చుని నిర్ణయాలు చేయడం..అవి ప్రజలకు చేరుతున్నాయో లేదో గమనించక పోవడం సరికాదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే విధంగా చేసేందుకు అవసరమైన కఠిన నిర్ణయాలు తీసుకుంటే మంచిది. అంతేగానీ కులాలు,మతాలు పేరుతో విభజించి పథకాలు అమలు చేయడం సరికాదు. బొక్కసం వెక్కిరించేలా చేయడం వల్ల..అప్పులు చేయడం వల్ల భవిష్యత్ తరానికి కోలుకోలేని దెబ్బ తగలగదని గుర్తించాలి.

## నిబంధనల ప్రకారం విధులు పకడ్బందీగా నిర్వహించాలి



**పెద్దపల్లి,తెలంగాణ దిశ :** జిల్లాలో అధికారులు నిబంధనల ప్రకారం విధులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో హై కోర్టు కేసులు, ఆర్.టి.ఐ. దరఖా స్తులు, ప్రజావాణి, ప్రజా దర్బార్ దరఖాస్తుల పై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణ్ శ్రీ తో కలిసి సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ కోర్టు కేసులను సరిగ్గా ఫాలో కాకపోవడం వల్ల ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పులు వస్తున్నాయని, ప్రతి శాఖ తమ పరిధిలో కోర్టు కేసులను ఎప్పటికప్పుడు ట్రాక్ చేయాలని, సరైన కౌంటర్ సకాలంలో ఫైల్ చేయాలని, మన దగ్గరి నుంచి కేసు సంబం ధించిన డాక్యుమెంట్స్ ఫైల్ చేయాలని అన్నారు. స మాచార హక్కు చట్టం కింద వచ్చే దరఖాస్తులకు నిబంధనల ప్రకారం సమాధానం సకాలంలో పంపాలని, ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్ ఉండవద్దని అన్నారు. దిశ సమావేశం సంబంధించిన మీటింగ్ పై తీసుకున్న చర్యలు రిపోర్ట్ రేపటి వరకు డి. ఆర్.డి.ఓ కార్యాలయానికి సమర్పిం చాలని కలెక్టర్ తెలిపారు. ప్రోటోకాల్ సంబంధించి చెక్ లిస్ట్ ప్రతి శాఖ పంపాలని అన్నారు. ప్రతి నెలా జిల్లా అధికారులు తమ టూర్ డైరీ వివరాలు, ఓవరాల్ యాక్టివిటీ కలెక్టరేట్ హెచ్ విభాగానికి సమర్పించాలని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో శాఖపరమైన లక్ష్యాలు, వాటి సాధనకు తయారు చేసుకున్న ప్రణాళికలు రిపోర్ట్ అందించాలని అన్నారు. ఔట్ సోర్సింగ్ , కాంట్రాక్ట్ పద్ధతులలో సిబ్బంది నియామకం సంబంధించి ప్రతి అంశాన్ని కలెక్టరేట్ దృష్టికి తప్పనిసరిగా తీసుకొని రావాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం సజావుగా నియామకం జరిగేలా చూడాలని అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఎక్కడా కూడా అవినీతి ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఏఐ టూల్స్ వాడుతూ మన కార్యాల య విధులను సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు.

## గిరిజన ప్రజలకు ఆధార్ కార్డులివ్వండి

### గ్రామాలలో ప్రత్యేక ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేయాలి
### సామాజిక కార్యకర్త, న్యాయవాది కర్నె రవి

భద్రాద్రి,తెలంగాణ దిశ : మణుగూరు, అందరికీ ఆధార్ ఓ వరమని, ఆధార్ కార్డ్ తో అన్ని ప్రభుత్వ అందుకోవచ్చని, కానీ మండలంలో ని మారుమూ ల గిరిజనులకు మాత్రం అది ఇంకా ఓ శాపంగా మారిందని ,సామాజిక కార్యకర్త, న్యాయ వాది కర్నె రవి అన్నారు. ఆధార్ కార్డులు లేని గిరిజనులకు ఆధా ర్ కార్డులు మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని, జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలని కోరుతూ ఆయన తహసిల్దార్ అద్దంకి నరేష్ నరేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భం గా రవి మాట్లాడుతూ.. మండలం లో మారుమూల ఆది వాసి గ్రా మాలైన ఖమ్మం తోగు, బుగ్గ, బు డుగుల, పెద్దిపల్లి, ఇప్పల గుంపు గ్రామాలకు చెందిన గుత్తి కోయ ప్రజల పిల్లలకు, ఆధార్ కార్డులు, బర్త్ సర్టిఫికెట్లు, లేకపోవడంతో చదువుకు, ఇతర ప్రభుత్వ పథకాలకు ఇప్పటి వరకు దూరంగా ఉన్నారని తెలి పారు. ఓవైపు ఆయా గ్రామాల్లో అధికంగా నిరక్షరాస్యులు ఉన్నా రని, దీంతో వారు ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలియక నేటి వరకు ఆధార్ కార్డులనుప్రజలు పొందలేదన్నారు.ప్రభుత్వ సంక్షే మపథకాలు పొందాలంటే తప్ప నిసరిగా ఆధార్ కార్డు అవసర మని, మొదటిగా జనన ధ్రువీ కరణ పత్రం అవసరమని, ధ్రువీ కరణ పత్రం లేకపోవడం తో వారికీ ఇప్పటివరకు ఆధార్ కా ర్డులు మంజూరు కాలేదన్నా రు.విద్యార్థులను స్కూల్‌లో వేయాలంటే ఆధార్ తప్పనిసరి, రేషన్ కార్డ్ కావాలంటే ఆధార్ ఉండాలి, అనుకోని



ప్రమాదం జరిగితే ఆరోగ్యశ్రీ కింద చికిత్సకి కూడా ఆధారే కీలకం. కానీ ఆధా ర్ గురించి, పథకాల గురించి సరైన అవగాహన లేక గిరిజ నులు వీటన్నిటికీ దూరమైపోయారని పేర్కొన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టి, ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రా లలోబర్త్ సర్టిఫికెట్ తో సంబంధం లేకుండా, కుటుంబ వివరాలను నమోదు చేసుకొని మండల స్థాయి అధికా రులు సమన్వయంతో వందశాతం గిరిజనులకు ఆధార్ కార్డులను అందించేందుకు చర్యలు తీసు కోవాలని కోరారు.

## నాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు..!

### కోరపల్లి మాజీ సర్పంచ్ బోయిని సమ్మయ్య

జమ్మికుంట,తెలంగాణ దిశ : జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామం మాజీ సర్పంచ్, బోయిని సమ్మయ్య, రోజున జమ్మికుంటలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..! గత కొంతకాలంగా గ్రామంలో రాజకీయంగా నేనంటే గిట్టని కొంతమంది కలిసి, నేను భూమి కబ్జా చేశానని తప్పుగా ఆరోపణలు చేశారని. ఈ క్రమములో కోరపల్లిలో జమ్మికుంట మండ లం తాసిల్దార్ ఆధ్వర్యంలో జరిగిన భూభారతి కార్యక్రమంలో బ్యానర్ పట్టుకొని నాపై ఆరోపణలు చేశారని .కానీ దొంగే,, దొంగ దొంగ అని అన్నట్లుగా బ్యానర్ ప్రదర్శించిన వాళ్లే భూ కబ్జాలకు పాల్పడ్డారని వారి అన్ని వివరాలు తేదీ 14/ 7/ 2025 సోమవారం నాడు ప్రజావాణి లో కలెక్టర్ కు ఇవ్వడం జరిగిందన్నారు. మండల్ తాసిల్దార్ కార్యాలయం నుండి సమాచార హక్కు చట్టం ప్రకారం వాళ్ల కబ్జాల భాగవతం తీయడం జరిగింది అని తెలిపారు. అలాగే పాస్టర్ అనిల్ కుమార్ ఇతను మా గ్రామానికి ఆరు సంవత్సరాల క్రితం రావడం జరిగిందన్నారు. కానీ 20 సంవత్సరాల క్రితవే తనకి నారాయణరావు వ్రాసినట్టుగా అతను మాట్లాడుతున్నాడని, కానీ నారాయణరావు రైటింగ్ అందరికీ తెలుసు అని, ఈ విషయంపై బహిరంగ చర్చకు సిద్ధమని తెలిపారు. 969 / %ఎ%,5 గుంటల భూమి రాయించుకొని 968 / %ఖ% మా యొక్క తల్లి భూమి లోనికి వస్తూ అమాయకులైన కొంత మందిని వెంట వేసుకొని రోడ్డుపైకి వచ్చి ధర్నాలు చేస్తూ రాజకీయంగా నాకు గిట్టని వాళ్ల తో చేతులు కలిపి నా మీద ఆరోపణ చేయడం జరుగుతుందని అన్నారు. అలాగే గిరవెన శ్రీనివాస్ వీళ్ళకి తోడుగా ఇతను కూడా,,పాడి లీలాదేవి భూమి నేను నాతో పాటు కొంతమంది యాదవులు కొనుగోలు చేస్తే దానిని కూడా 12 ఎకరాల 13 గుంటలు ఒక తప్పుడు ఆర్ వో ఆర్ సర్టిఫికెట్ సృష్టించుకుని తాహసిల్దార్ భాస్కరరావు, ఇచ్చినట్టుగా ఫేక్ సర్టిఫికెట్ సృష్టించడం జరిగిందని అన్నారు. తాహసిల్దార్ భాస్కరరావు, 2011/ 6వ నెలలో జమ్మికుంట నుండి బదిలీపై వెళ్లగా భాస్కరరావు 9 వ నెలలో అక్రమంగా రెవెన్యూ రికార్డులో భూమి ఎక్కించుకొని నాదే అనుకుంటూ అధికారుల చుట్టూ తిరుగుకుంటూ నా మీద బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాడని ఈ సందర్భంగా వివరించారు. అతనే స్వయంగా సివిల్ కేస్ కోర్టులో వేసిన దాంట్లో 40 ఎకరాల కబ్జాకు పాడి లీలాదేవి యొక్క భూమి వాళ్ల తండ్రి పేరు మీద వన్ బి లో ఎమ్మార్వో ఆఫీస్ లో భద్రంగా ఉన్న వన్ బీలో 12 ఎకరాల 11 గుంటలు ఎక్కించడం జరిగిందని తెలిపారు. రెవెన్యూ రికార్డులో టాంపరింగ్ కు పాల్పడ్డట్టుగా తెలిపారు. ఇతనితో పాటు పింగిలి రాకేష్ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఫిషరీష్ చైర్మన్ అని చెప్పుకుంటూ మా ఊరి గోపాల్ రెడ్డి తల్లి పింగిలి నరసమ్మ పేరు గల భూమిని 971 లో 18 గుంటల భూమి వీళ్ళ తాత పేరు పింగిలి అని ఉన్నందుకు పింగిలి నరసయ్యగా ఉంటే పింగిలి నరసమ్మను, పింగిలి నరసయ్యగా దిద్దుకొని ఆ 18 గుంటలు మాది అని ఆ రికార్డులో మార్పు చేసుకొని వాళ్ళ తండ్రి పేరు మీద అట్టి భూమిని విలాసతూ చేసుకున్నారని అన్నారు. వారిదేమో రెడ్డి కులం, ఈ పింగిని రాకేష్ ది తెనుగు కులం, పింగిలి రాకేష్ అనే వ్యక్తి చీటింగ్ చేసుకుంటూ,ప్రభుత్వం పేరు చెప్పుకొని దౌర్జన్యాలకు దిగుతూ ఇతనే నామీద ఫేస్బుక్లో గాని, సోషల్ మీడియాలో గాని,అసత్యపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. మా ఊరి కోరపల్లి మాజీ సర్పంచ్ కందికట్ల మధుసూదన్,అనే వ్యక్తి పింగిలి వెంకటేశ్వర్ రెడ్డి ద్వారా 889 సర్వేనెంబర్ లో 5 ఎకరాల 14 గుంటల భూమిని వాళ్ల భార్య కందికట్ల సంధ్యారాణి, పేరుమీద రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందని అన్నారు. కానీ వెంకటేశ్వర రెడ్డి కి,,నేను తీసుకున్న సమాచార హక్కు చట్టం పాహనీ లో పట్టా గాని లేదు. కావాలని వెంకటేశ్వర రెడ్డినీ మభ్యపెట్టి అతని పేరుపై చేసుకొని రెవెన్యూ అధికారులను కూడా మభ్యపెట్టి అతను దొంగ రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లుగా తెలిపారు. గత 15 సంవత్సరాలుగా తన మీదికి రాకుండా కొంతమంది పోలీసు వారి దగ్గరికి వెళ్లి తప్పుడు సమాచారం ఇచ్చి, గత సంవత్సరము గొడవ పెట్టి అల్లర్లు సృష్టించే ప్రయత్నం చేశారని అన్నారు. దీని అంతటికి కారణం కందికట్ల మధుసూదన్ , డిసి శ్రీనివాస్, ఫాస్టర్, లు వీరందరూ నాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కోరపల్లి గ్రామంలో బహిరంగంగా చర్చకు నేను సిద్ధమని తెలిపారు. వీళ్ళందరూ ఒక గ్రూపుగా ఏర్పడి వీళ్ళే తప్పుడుగా రెవెన్యూ రికార్డులను మార్చి, భూ కబ్జాలకు పాల్పడి తప్పుడు డాక్యుమెంట్స్ సృష్టించి ఈ భూములు కబ్జా చేసిందే కాకుండా, తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. నాపై పబ్లిక్ లో సోషల్ డ్యామేజ్ చేస్తున్నారని వారిపై పరువు నష్ట ధావా వేసానని వారికి నోటీసులు కూడా ముట్టినాయని.వారిని త్వరలో కోర్టుకు కూడా ఇడుస్తానని ఈ సందర్భంగా బోయిని సమ్మయ్య, పేర్కొన్నారు...

## కేసులు మీద కేసులు..!

**తిరుపతి,తెలంగాణ దిశ :** ప్రభుత్వ అండదండలతో రెచ్చిపోతారా?! విచ్చలవి డిగా కేసులు పెడతారా?! మీరు మాపై కేసు మీద కేసు రాస్తే? మేం తప్పక ఇస్తాం రివర్స్ డోసు అంటున్నారు వైసీపీ నేతలు. చట్టబద్ధంకాని కేసులను చట్టబద్ధంగానే తేల్చుకుంటామంటూ సవాల్ చేస్తున్నారు. ప్రైవేట్ కేసులు వేసి ఓవైపు ప్రభుత్వం, మరోవైపు అధికారుల పని పడతామంటున్నారు?! అసలింతకీ ఈ ప్రైవేట్ కేసులంటే ఏంటి?? వాటి ఇంపాక్ట్ ఎలా ఉంటుంది?? ఇదే అంశం ఇప్పుడు రాజకీయవర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది.మాజీ సీఎం జగన్ వరుస పర్యటనలపై రాజకీయ రచ్చ ఏరేంజ్‌లో అయితే నడుస్తోందో? కేసులు కూడా అదే స్థాయిలో నమోదవుతున్నాయి?! అంతకుముందు గుంటూ రు, మొన్నామధ్య పల్నాడు, లేటెస్ట్‌గా బంగారుపాళ్యం పర్యటన పైనాకేసులు ఫైల్ అవ్వడం చర్చనీయాంశమైంది. జగన్ పర్యటనలో వైసీపీ నేతలు, కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శిం చడంతోపాటు పూర్తిగా ఆంక్షలు ఉల్లంఘిస్తున్నారంటూ కేసులు మీద కేసులు నమోదవుతున్నాయి. వైసీపీ కీలక నేతలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలపైనా కేసులు ఫైల్ అయ్యాయి. అంతేకాదు పల్నాడు జిల్లా రెంటపాళ్ల పర్యటనలో సింగయ్యను జగన్ కారు ఢీకొట్టిందంటూ జగన్‌పైనా కేసు నమోదవ్వడంపై భగ్గుమన్న వైసీపీ నేతలు రివర్స్ ఎటాక్‌కి రెడీ అయిపోయారు. సంబంధం లేని వాళ్లందరిపై కూటమి ప్రభుత్వం కేసులు పెడుతోందని ఆరోపిస్తున్న వైసీపీ నేతలు? తప్పు ఎవరిదైనా తమ నేతలపైనే కేసులు పెడుతున్నారంటూ ఆగ్రహిస్తున్నారు. అలాంటి వాటికి వైసీపీలో భయపడే వాళ్లు ఎవరూ లేరంటూనే? ప్రైవేట్ కేసులతో ప్రభుత్వ పెద్దలు, ప్రభుత్వ అధికారుల పని పడతామంటున్నారు. ఇక కాస్కోండి అంటూ సవాల్ విసురుతున్నారు. తమపై కక్ష కట్టిన ఏ ఒక్కరిని వదలిపెట్టే ప్రసక్తే లేదన్నారు.వైసీపీ నేతల మాటలతో అసలీ ప్రైవేట్ కేసులంటే ఏంటి?? అవి వేస్తే ఏమవుతుందన్న అంశంపై చర్చ మొదలైంది. ప్రైవేటు కేసు వేయడం అంటే? ఒక వ్యక్తి నేరుగా కోర్టులో దాఖలు చేసే ఫిర్యాదు. సాధారణంగా, పోలీసులు ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయడానికి నిరాకరించినప్పుడు లేదా ఎలాంటి చర్యలు తీసుకోనప్పుడు బాధితులు నేరుగా కోర్టులో ప్రైవేటు కంప్లయింట్ దాఖలు చేస్తారు. ఆ తర్వాత ఫిర్యాదు చేసిన వ్యక్తి మేజిస్ట్రేట్ ముందు హాజరై తన ఇబ్బందులేంటో చెప్పాల్సి ఉంటుంది. ప్రభుత్వాధికారులు ఎందుకు కేసు ఫైల్ చేయలేదో క్లారిటీ కూడా ఇవ్వాలి. ఇక ఇరువర్గాల వాదనల అనంతరం కోర్టు తీర్పునిస్తుంది. అయితే పక్కా ఆధారాలు, తమవైపు ఎలాంటి తప్పులేదనుకున్నప్పుడు మాత్రమే ఈ ప్రైవేట్ కేసులు వేయడానికి సిద్ధమవుతారు. ఇప్పుడు వైసీపీ నేతలు కూడా మేం సిద్ధమంటున్నారు.మొత్తంగా? ప్రైవేట్ కేసులు వేసే విషయంలో వెనక్కి తగ్గేదేలే అంటున్నారు వైసీపీ నేతలు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకున్న వారికి చట్టబద్ధంగానే శిక్ష పడేలా చేస్తామంటున్నారు. మరీ వైసీపీ అన్నట్లుగానే ప్రైవేట్ కేసులు వేస్తుందా?? లేక మాటలతోనే సరిపెడుతుందా?? అన్నది తేలాంటే కాస్త ఆగాల్సిందే.

## గీత కార్మికుల ప్రమాదాల నివారణకు రక్షక కవచాలు

**కమాన్ పూర్ ,తెలంగాణ దిశ :** ఈత కార్మికుల ప్రమాదాల నివారణకు ప్రభుత్వం రక్షణ కవచాలను అందజేస్తుందని ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్ అన్నారు పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ముర్మూర్ గ్రామంలో గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం కిట్ శిక్షణ కార్యక్రమం నిర్వహించి, తదనంతరం కిట్ లను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ గీత కార్మికులు చెట్లు ఎక్కే క్రమంలో, దిగే క్రమంలో ప్రమాదాలు జరగకుండా, ప్రాణ నష్టం జరగకుండా ఉండేందుకు కాటమయ్య రక్షణ కవచం కిట్ ఉపయోగకరంగా ఉంటుందని ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ కానిస్టేబుళ్లు రఘు, రాజు, శ్రావణ్, గీత ట్రైనర్లు జాగిరి అంజి గౌడ్, పొన్నం వెంకటేష్ గౌడ్,కాట రవీందర్ గౌడ్,బత్తిని శ్రీనివాస్ గౌడ్, గోలి వాడ గౌడ సంఘం అధ్యక్షులు కోల రామ్మూర్తి గౌడ్, చంద్రమౌళి, బూరుగు రవి గౌడ్, మడ్డి రామ్ గౌడ్. అంతర్గాం, వివిధ గ్రామాల గీత కార్మికులు పాల్గొన్నారు.



# ఉపాధి హామీ చట్టాన్ని సంరక్షించుకుందాం



గ్రామీణ భారతంలో కుల, మత, లింగ బేధం లేకుండా అన్ని రకాల ప్రజలకు వారి జీవన హక్కులను బలోపేతం చేయడానికి 2005లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (దాన్ని నరేగా అని కూడా పిలుస్తున్నారు) పార్లమెంటులో ఆమోదించబడి చట్టంగా తయారైంది. మొట్టమొదటి యుపిఏ ప్రభుత్వ కాలంలో వామపక్షాల సంపూర్ణ మద్దతుతో రూపొందించబడింది. 2014లో బిజెపి కేంద్రంలో అధికారం చేజిక్కించుకోగానే ఉపాధి చట్టానికి తూట్లు పొడవడం మొదలు పెట్టి దాని స్ఫూర్తిని నాశనం చేయడానికి చర్యలు చేపట్టింది. పార్లమెంటులో తయారైన శాసనానికి ఏ విధమైన చర్చ లేకుండా దానికి మార్పులు చేయడం ద్వారా.. చట్టం స్ఫూర్తినేకాక భారత ప్రజాస్వామ్య స్ఫూర్తిపై కూడా ఆ పార్టీ దాడి చేయడం ప్రారంభించింది.

ఉపాధిపై బిజెపి దాడి: అధికారంలోనికి వచ్చిన నాటి నుండి బిజెపి ఉపాధి హామీ చట్టం స్ఫూర్తిని నీరుగార్చుడానికి అనేక రకాల ప్రయత్నాలు చేస్తున్నది.

మొదటిది: మొట్టమొదట పథకం ప్రవేశ పెట్టినపుడు కేంద్ర బడ్జెట్లో నాలుగు శాతం నిధులు అంటే 2.5 లక్షల కోట్లు కేటాయించగా తర్వాత వచ్చిన బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేవలం 1.37 శాతం (రూ.86 వేల కోట్లు) మాత్రమే కేటాయించింది. అంతేకాక గతేడాది కేటాయింపుల కంటే ఈ సంవత్సరపు కేటాయింపులు పెరగకపోగా కేటాయించిన పూర్తి బడ్జెట్‌ను కూడా ఈ పథకానికి వినియోగించడంలో పూర్తిగా విఫలమైంది. చట్టం ప్రకారం రకరకాల కారణాలచేత కనీసం వంద పని దినాలు కల్పించడంలో విఫలమవుతుండగా బడ్జెట్ కేటాయింపులు ఈ పరిస్థితిని మరింత దిగజార్చుతున్నాయి. ఈ ఏడాది సగటున కల్పించిన పని దినాలు 50.23 కాగా గత ఆర్థిక సంవత్సరం ముందు అది 52.8 గా ఉంది. అంటే రానురానూ బిజెపి ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నదనడంలో సందేహం లేదు.

రెండవది: నమోదైన కూలీల పేర్లు అర్థాంతరంగా తొలగించడం. గత సంవత్సరానికి ముందు ఉపాధి పథకానికి 25.2 కోట్ల మంది నమోదు కాగా ఆధార్ ఆధారిత ధ్రువీకరణ తర్వాత ఆ సంఖ్య 18.28 కోట్లకు తగ్గింది. అంతమందినే ప్రభుత్వం ఈ పథకానికి అర్హులుగా నిర్ధారించింది. బిజెపి ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఆధార్ ఆధారిత చెల్లింపు విధానం ప్రవేశపెట్టిన నాటి నుండి ఈ పరిస్థితి నెలకొన్నది. ఒకపక్క గ్రామీణ భారతంలో కొన్నేళ్లుగా నిరుద్యోగం, ఉపాధి లేమి పెరుగుతుండగా ఉపాధి కల్పించే జాబు కార్డుల తొలగింపు కూడా పని దినాల తగ్గింపుకు దారితీసింది. 2020 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పథకం 389.09 కోట్ల పనిదినాలు కల్పించగా గత ఆర్థిక సంవత్సరంలో కేవలం 286.26 కోట్ల పనిదినాలు మాత్రమే కల్పించింది.

మూడవది: ఉపాధి హామీ చట్టం అమలులోకి వచ్చిన కొత్తలో దళిత ఆదివాసీల అసైన్డ్ భూములను అభివృద్ధిపరిచే పని బాగా ప్రోత్సహించడం జరిగింది. ఫలితంగా గ్రామీణ, వ్యవసాయ ఆర్థిక పరిస్థితుల్లో కొంతమేరకు వృద్ధి కనబడింది. కాగా తర్వాత వచ్చిన బిజెపి ప్రభుత్వం గ్రామీణ ప్రాంత భూములపై కాక పట్టణ ప్రాంత భూముల అభివృద్ధిపై దృష్టి సారించింది. గతంలో 65 శాతం నిధులు వ్యవసాయ లేదా దాని అనుబంధ కార్యకలాపాలకు వినియోగించితే నేడు అది 46.74 శాతానికి పడిపోయింది. మరొక ముఖ్యమైన డిమాండ్ ఉపాధి వ్యవసాయ పనులను అనుసంధానించడం. ఉపాధి పనులను పెంచడానికి బదులుగా బిజెపి ప్రభుత్వం గ్రామీణ నిరుపేద రైతు కూలీలను భూస్వాముల ధనికుల భూముల్లో పని చేయమని బలవంతం చేస్తున్నది. తద్వారా గ్రామీణ ధనవంతులతో రైతు కూలీల బేరసారాల శక్తి తగ్గిపోయింది పనిదినాల సంఖ్య కూడా తగ్గిపోయింది. ఉపాధి చట్టానికి మరిన్ని తూట్లు పొడుస్తూ బిజెపి సర్కార్ రాష్ట్రాలకున్న నిర్ణయాత్మక శక్తి లేకుండా కేవలం కొద్ది సంఖ్యలో మాత్రమే పని దినాల కేటాయింపుకు తెగబడింది.

నాలుగవది: ఉపాధి హామీ చట్టం అమలులో రైతు కూలీలకు పని దినాలు తగ్గే విధంగా యంత్ర సాంకేతికతను ప్రోత్సహించడం, సామాగ్రి విడి భాగాల కొనుగోలు ఖర్చును ఈ నిధుల నుండే ఖర్చు చేయడం జరిగింది. ఈ పథకం ప్రవేశపెట్టిన కొత్తలో కేవలం పది శాతం మాత్రమే వస్తువులు విడిభాగాలకు కేటాయించారు. మిగిలిన నిధులు రైతు కూలీల జీతాలు చెల్లింపులకు వినియోగించారు కానీ నేడు అది 36 శాతానికి పెరిగింది. యంత్రాల వాడకం కూడా పెరిగింది. పర్యవసానంగా రైతు కూలీల బదులు యంత్రాలు సాంకేతికత వినియోగం పెరిగి పని దినాలు పడిపోయాయి.

ఐదవది: ఈమధ్య ఉపాధి రైతు కూలీలకు రెండు నుండి ఏడు శాతం వేతనం మాత్రమే పెంచడం కేవలం వారిని స్పష్టంగా ఈ పనులకు దూరంగా ఉంచడమే. వారి శ్రమ దోపిడీకి పాల్పడడమే. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 300 నుండి 307కు పెరగగా బీహార్‌లో 245 నుండి 255కు కేరళలో 346 నుండి 349కి వారి వేతనాలు పెరిగాయి. ఈ రకమైన పెంపు చేసినప్పుడు పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని జీవన వ్యయాన్ని గమనంలోనికి తీసుకోకపోవడం సిగ్గుచేటు. ఉపాధి చట్టం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన జీతాన్ని కేంద్రం కూడా అమలు పరచాలి. కేరళ ప్రభుత్వం 800 రూపాయలు నిర్ణయించగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది చాలా తక్కువగా ఉండటం శోచనీయం.

నిధులు ఇవ్వకుండా నీరుగార్చే కుట్ర: ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం త్రైమాసిక నిధులుగా రూ.29,803 కోట్లు గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖకు విడుదల చేసింది. ఇందులో రూ.19,226 కోట్లు మాత్రమే రాష్ట్రాలకు కేటాయించింది. పనిచేసిన రైతు కూలీలకు 14 రోజుల్లోగా చెల్లింపులు జరగాలి కానీ ఇప్పటికీ లక్షలాది మందికి సకాలంలో చెల్లింపులు జరగక అవస్తలు పడుతున్న పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మాత్రం పూర్తిగా కేటాయించిన నిధులను రాష్ట్రాలకు విడుదల చేయకపోవడం దారుణం. బిజెపి ఈ విధంగా నిరుపేదలపై దాడికి పూనుకోగా కొన్ని రాష్ట్రాలు గ్రామాలను పట్టణీకరించే పనిలో అత్యుత్సాహం చూపుతున్నాయి. వాటిని మున్సిపాలిటీలలో కలుపుతున్నాయి. ఉపాధి చట్టం పట్టణాలకు వర్తించదు కాబట్టి ఆ చట్టం అమలు కొన్నిచోట్ల ప్రశ్నార్థకం అవుతున్నది. ఇది కేవలం పంచాయతీల్లోని గ్రామాలకు మాత్రమే వర్తిస్తుంది. అంటే ఇది చట్టాన్ని నీరుగార్చే కుట్రలో మరో భాగం. పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ నాయకత్వంలోని ప్రభుత్వంలో అవినీతి పేరుకుపోయిందనే సాకుతో గత మూడేళ్లుగా ఆ రాష్ట్రానికి కేంద్రం ఉపాధి నిధులు విడుదల చేయడం లేదు. నిధులు ఆపి గ్రామీణ కూలీలను ఇబ్బంది పెట్టిన కేంద్రం తీరును ఇటీవల కలకత్తా హైకోర్టు తప్పుపట్టింది. ఉపాధి గ్రామీణ ప్రజల హక్కు అని తేల్చిచెబుతూ 2025 ఆగష్టు ఒకటినుంచి ప్రారంభించాలని ఆదేశాలు జారీచేసింది.

సంఘటిత ఉద్యమాలే శరణ్యం: ప్రపంచ బ్యాంకు నిబంధనల ప్రకారం మూడు డాలర్ల కన్నా తక్కువ ఆదాయం ఉన్నవారు అత్యంత నిరుపేదలు. ఉపాధి హామీ చట్టం అమలు కారణంగా గ్రామీణ పేదలు అంతకన్నా ఎక్కువ ఆదాయం పొందడంతో అత్యంత నిరుపేదల లిస్టు నుండి వారు బయటపడ్డారు. కానీ ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ అమల్లోకి రావడంతో తిరిగి వారు మళ్లీ పేదరికంలోనికి నెట్టి వేయబడుతున్నారు. కేంద్రం విధానాల వల్ల నేటి గ్రామీణ భారతంలో నిరుపేదలకు, ధనస్వాములకు ఒక వైరుధ్యం ఏర్పడుతున్నది. ఈ అంతరాలను తొలగించడానికి మనం గ్రామీణ నిరుపేదల పక్షాన నిలవాలి. వారిని సంఘటిత పరిచి ముందుకు నడిపించాలి. అందుకుగాను కేంద్రం ఉపాధి బడ్జెట్‌ను రూ 2.5 లక్షల కోట్లకు పెంచేలా ఉద్యమాల ద్వారా ఒత్తిడి తేవాలి. అలాగే ఏడాదికి 200 పనిదినాలు కల్పించేలా, కనీస వేతనం రూ.600గా నిర్ణయించేలా పోరాటాలు చేయాలి. అప్పుడు మాత్రమే గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని సంరక్షించుకోగలం. ఇది నేటి ఆవశ్యకత.

## కోట్లలో మరణాలు.. ఇంకా యాక్టివ్‌లోనే ఆధార్ కార్డులు ..!




అమరావతి : దేశంలో గత 14 సంవత్సరాల్లో సుమారు 11.7 కోట్ల మంది మరణించినప్పటికీ ఆధార్ కార్డులను జారీ చేసే భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ ఉడాయ్ మాత్రం కేవలం 1.15 కోట్ల ఆధార్ నంబర్లను మాత్రమే డీయాక్టివేట్ చేసిందని సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా వెల్లడయింది. ఇది దేశ మరణాల రేటుతో పోలిస్తే చాలా తక్కువ..! అయితే దీని వల్ల ఆధార్ నంబర్లు దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గత 14 ఏళ్లలో తక్కువ డీయాక్టివేట్లు ..!:2025 జూన్ నాటికి భారతదేశంలో 142.39 కోట్ల ఆధార్ హోల్డర్లు ఉన్నారు. ఇక ఐక్యరాజ్యసమితి జనాభా లెక్కల ప్రకారం . ఏప్రిల్ 2025 నాటికి దేశ మొత్తం జనాభా 146.39 కోట్లుగా ఉంది. అయితే, 2007-2019 మధ్య ఏడాదికి సగటున 83.5 లక్షల మరణాలు నమోదయ్యాయి. ఈ లెక్కన గత 14 సంవత్సరాల్లో 11.69 కోట్ల మంది మరణించి ఉండొచ్చు. అయినప్పటికీ ఉడారు ఈ 14 ఏళ్లలో కేవలం 1.15 కోట్ల ఆధార్ నంబర్లను మాత్రమే మరణాల ఆధారంగా డీయాక్టివేట్ చేసింది. ఇది దేశ మరణాల రేటుతో పోలిస్తే 10 శాతం మాత్రంగానే ఉంది. అయితే, ఈ ప్రక్రియ మరణ ధ్రువీకరణ పత్రం, కుటుంబ సభ్యులు ఇచ్చే సమాచారం ఆధారంగా జరుగుతుందని సమాచార హక్కు చట్టం ద్వారా ఉడాయ్ వెల్లడించింది. 2024 డిసెంబర్ 31 నాటికి మరణాల ఆధారంగా మొత్తం 1.15 కోట్ల ఆధార్ నంబర్లు డీయాక్టివేట్ చేసినట్లు ఉడాయ్ పేర్కొంది.


## ఉద్యోగాల పేరిట.. కుచ్చుటోపి!

ఆదిలాబాద్: ఆదిలాబాద్ పట్టణం రాంనగర్ కాలనీ సమీపంలో డిజిటల్ మైక్రో ఫైనాన్స్ సంస్థ తమకు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం చేశారని ఆరోపిస్తు బాధితులు ఆందోళన చేపట్టారు. డిజిటల్ మైక్రో ఫైనాన్స్ సంస్థ ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను నమ్మించి యూనిఫామ్ వంకతో సుమారు 400 మంది నుండి 20 వేలు చొప్పున వసూలు చేశారన్నారు. ఉద్యోగం కోసం ఒక్కొక్కరి నుంచి సుమారు లక్ష వరకు వసూలు చేశారని ఆరోపించారు.. తీరా చూస్తే రెండు రోజుల నుండి ఆఫీస్ ఓపెన్ చేయకపోవడంతో పాటు ఫోన్ చేస్తే స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు బాధితులు.. అటు ఉట్నూర్ లోనూ ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది.. ఉద్యోగాల పేరుతో మైక్రో ఫైనాన్స్ సంస్థ తమను మోసం చేసిందని బాధితులు ఆందోళన చేపట్టారు..

## ఆచి తూచి అడుగులు వేసినా..!

తిరుపతి: జనసేన అధినేత పవన్ కల్యాణ్ 2014 లో పార్టీ పెట్టినా పార్టీని విస్తరించకపోవడానికి కారణం ప్రధానమైనది నేతలు పార్టీని ఇబ్బందిపెడతారనే. అందుకే ఆయన అన్ని నియోజకవర్గాల్లో ఇబ్బడి ముబ్బడిగా నేతలకు ఇన్ ఛార్జి పదవి ఇచ్చేసి జనసేన పార్టీని బలోపేతం చేయడానికి ప్రయత్నించలేదు. పార్టీ బలపడకపోయినా పరవాలేదు కానీ, నేతల వల్ల పార్టీకి, తనకు వ్యక్తిగతంగా చెడ్డపేరు రాకూడదనే గత పదేళ్ల నుంచి ఆయన ఆచితూచి నేతల విషయంలో నిర్ణయం తీసుకుంటున్నారు. తనకు నమ్మకమైన నేతలను మాత్రమే నియమించారు. అదీ తనకు సంబంధించిన వారు, దగ్గరగా ఉన్న వారు సిఫార్సు చేసిన వారికి మాత్రమే పదవులు కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. పార్టీ పెట్టి పదేళ్లవుతున్నా జనసేన బలోపేతం పై పవన్ కల్యాణ్ దృష్టి పెట్టడం లేదని, కనీసం ఇన్ ఛార్జులను కూడా నియమించడం లేదని, పదవులను అప్పగించడం లేదన్న విమర్శలను ఆయనపెద్దగా పట్టించుకోరు. లైట్ గానే తీసుకుంటారు. పార్టీ పదవి ఇచ్చిన తర్వాత నేతలు తనకు తెలియకుండా ఏదైనాఅవినీతి ఆరోపణలను ఎదుర్కొన్నా, మరేదైనా కేసులో ఇరుక్కుంటే తన పరువు ప్రజల్లో దెబ్బతింటుందని, అందుకే తక్కువ స్థానాల్లో పోటీ చేసి అయినా పూర్తి స్థాయి విజయం సాధించి అధికారంలోకి రావాలని ఆయన తొలి నుంచి ఆలోచనలో ఉన్నారు. అందులో భాగంగానే గత ఎన్నికల సమయంలో ఎలాంటి షరతులు లేకుండా పొత్తును ప్రకటించి కేవలం 21 నియోజకవర్గాల్లోనే పోటీ చేస్తామని ప్రకటించారు. అప్పుడు కూడా ఆయన విమర్శలు ఎదుర్కొన్నారు. 21 స్థానాలను తీసుకోవడమేంటని, జనసేన కారణంగానే కూటమి ఏర్పడిందని, అందువల్ల ఎక్కువ స్థానాలను తీసుకోవాలని పవన్ కల్యాణ్ పై పలువురు కామెంట్స్ చేసినా ఆయన పట్టించుకోలేదు. ఎమ్మెల్యేలు తక్కువగా ఉంటే వారిపై నిఘా పెట్టడంతో పాటు వారి పనితీరును ఎప్పటికప్పుడు గమనించవచ్చని, ఎక్కువ సంఖ్య అయ్యే కొద్దీ సమాచారం తెప్పించుకోవడం కూడా కష్టంగా మారుతుందని, టీడీపీ, వైసీపీలకు పోటీగా జనసేన కూడా తయారవ్వడం మినహా మరొకటి ఉండదని పవన్ కల్యాణ్ చంద్రబాబుపై పెద్దగా ఒత్తిడి తేకుండానే తనకు ఇచ్చిన సీట్లతోనే సరిపుచ్చుకుని వాటన్నింటిలో అభ్యర్థులను గెలిపించుకున్నారు- ఇక ఎమ్మెల్యేల సంగతి అలా ఉంచితే పార్టీ ఇన్ ఛార్జుల విషయంలోనూ చాలా ఆచితూచి వ్యవహరిం చేవారు. అలాంటిది శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్ ఛార్జి కోటా వినుత విషయంలో తప్పుడు సమాచారం అందించారని కొందరు నేతలపై పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. వినుత హత్య కేసులో ఇరుక్కుని పార్టీ పరువును దిగజార్చారని, వైసీపీకి విమర్శించడానికి అవకాశాలు కల్పించినట్లయి ందని కూడా పవన్ కల్యాణ్ నేతలపై మండి పడినట్లు తెలిసింది. ఇటువంటి వారికి పదవులు ఇచ్చి తప్పు చేశామని కూడా పవన్ వ్యాఖ్యానించినట్లు సమాచారం. అందుకే పవన్ కల్యాణ్ ఇకపై పదవులు ఇచ్చే సమయంలోనూ ట్రాక్ రికార్డు చూసి మరీ ఇచ్చేందుకు మరింతగా అధ్యయనం చేయాలని నేతలకు సూచించినట్లు తెలిసింది.

## ఓటమిపై చర్చలెప్పుడు?




ఒంగోలు, ,: వైసీపీ అధినేత వైఎస్ జగన్ జిల్లాల పర్యటనలకు కొద్దిరోజులు విరామం ఇచ్చి నేతలతో సమావేశం అవ్వాలని కోరుతున్నారు. నేతలతో సమావేశమై ముందు గత ఎన్నికల్లో ఓటమికి గల కారణాలను పూర్తి స్థాయి విశ్లేషించడానికి సమయం వెచ్చించాలని నేతలు సయితం కోరుతున్నారు. గత ఐదేళ్ల పాటు పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పిదాలు, తీసుకున్న నిర్ణయాలు వంటి వాటిపై గ్రౌండ్ లెవెల్ లో ఏం జరుగుతుందన్న దానిపై నేతల నుంచి విడివిడిగా ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని కోరుతున్నారు. సమావేశాల్లో తాను చెప్పడమే కాకుండా, తాను చెప్పింది విని నేతలు వెళ్లే పనికి స్వస్తి చెప్పి వారికి మైకు ఇచ్చి మాట్లాడించగలిగితే చాలా వరకూ సమస్యలు పరిష్కారమవుతాయని సూచిస్తున్నారు పర్యటనలను సక్సెస్ అవుతున్నాయంటే? జగన్ జిల్లాల పర్యటనలు సక్సెస్ అవుతున్నాయంటే అందుకు నేతలు, కార్యకర్తలు కారణం. ఎందుకంటే ఆంక్షలు పెట్టినా నేతలు, కార్యకర్తలు భయపడకుండా రోడ్డుపైకి వస్తున్నారంటున్నారు. అంత ఉత్సాహంతో పనిచేస్తున్న కార్యకర్తలు, నేతలు ఈసారి ఎన్నికలలో ఇచ్చే హామీలతో పాటు అధికారంలోకి వస్తే ఏం చేయాలన్న దానిపై జగన్ నుంచి క్లారిటీ వస్తే మరింత పార్టీకి హైప్ వస్తుందని చెబుతున్నారు. వాలంటీర్ల వ్యవస్థను జగన్ తీసుకు వచ్చి తప్పు చేశానని ఇంత వరకూ ఆయన అనలేదు.పైగా వాలంటీర్లను తొలగించడం అన్యాయమంటూ జగన్ అధికార టీడీపీ పై విమర్శలు చేస్తుండటంతో మళ్లీ అధికారంలోకి వస్తే వాలంటీర్ల వ్యవస్థను తిరిగి తెస్తారా? అన్న అనుమానం కార్యకర్తల్లో ఉంది.. వాలంటీర్లు తిరిగి వస్తే తాము పార్టీ కోసం కష్టపడినా ప్రయోజనం ఏముంటుందని పలువురు అప్పుడే ప్రశ్నిస్తున్నారు. అలాగే కేవలం సంక్షేమ పథకాలు మాత్రమే కాకుండా ఎమ్మెల్యేలను కూడా ప్రజల్లో భాగస్వామ్యులను చేయగలిగేలా జగన్ పనితీరు ఉండాలని వైసీపీ నేతలు కోరుకుంటున్నారు. తమ చేత పంపిణీ చేయిచండంతో పాటు ప్రజలకు తమను దగ్గరకు చేర్చడం వంటి పనులను చేయగలిగితేనే ఈసారి గెలిచినా తగిన గుర్తింపు ఉంటుందని, లేకపోతే 2019 తర్వాత పరిస్థితి తిరిగి పునరావృతమవుతుందని, ఎన్ని లక్షల కోట్ల రూపాయలు బటన్ నొక్కి పంపిణీ చేసినా చివరకు ఎన్నికల సమయానికి అది ఏమాత్రం పనిచేయదని కూడా చెబుతున్నార. కార్యకర్తలకు ఈసారి తాను అధికారంలోకి వస్తే పెద్దపీట వేస్తానని, ప్రాధాన్యత ఇస్తానని జగన్ పదే పదే పలు సమావేశాల్లో చెబుతున్నారు. అంతవరకూ బాగానే ఉంది. అధికారంలోకి రాగానే తాము ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కార్యకర్తలకు ఏం చేయగలరన్న దానిపై కూడా క్లారిటీ ఉండాలని క్యాడర్ అభిప్రాయపడుతుంది. ఎమ్మెల్యేలతో పాటు క్యాడర్ ను కూడా సరిగా చూసుకుంటేనే గెలుపు సాధ్యమవుతుందని, ఈ నాలుగేళ్లు కూడా తాను చెప్పిందే విని వెళ్లాలని కాకుండా, వారి నుంచి కూడా ఫీడ్ బ్యాక్ తీసుకుని దాని ప్రకారం ముందుకు వెళితే మంచి ఫలితాలు రాబట్టుకోవచ్చని, ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని క్యాష్ చేసుకోవచ్చని పలువురు సూచిస్తున్నారు. మరి జగన్ నేతల మాట వింటారా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

## తెల్ల షర్టు, నల్ల ప్యాంటుతో రావద్దు : రోహిణి కోర్టు



షర్టు, నల్ల ప్యాంటుతో రాకూడదు అని ఢిల్లీలోని రోహిణి కోర్టు బార్ అసోసియేషన్ నిషేదాజ్ఞలు విధించింది. కొందరు న్యాయవాదుల్లాగా తెల్ల షర్టు,నల్ల ప్యాంటులతో వచ్చి మోసాలకు పాల్పడుతున్నట్లు కోర్టు గుర్తించింది. దీంతో న్యాయవాదులు తప్ప ఎవ్వరూ తెల్ల షర్టు, నల్ల ప్యాంటుతో కోర్టు పరిసరాల్లోకి రావద్దు అని నోటీసు జారీ చేసింది. కొంతమంది మధ్యవర్తులు తమను తాము న్యాయవాదులు లేదా వారి గుమస్తాలుగా చెప్పుకుంటూ. మోసాలకు పాల్పడుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని కోర్టు తెలిపింది. దీంతో గుమస్తాలు, వ్యాజ్యాలు దాఖలు చేసేవారు, సాధారణ ప్రజలు ఎవరూ తెల్ల చొక్కా, నల్ల ప్యాంటు ధరించకూ డదని పేర్కొంది. అందుకే కోర్టు పరిసరాల్లోకి న్యాయవాదులు మాత్రమే అలాంటి దుస్తులు ధరించి రావాలని స్పష్టం చేసింది.


## ప్రైవేట్ జెట్‌ను కొన్న జొమాటో సిఈఓ




బిజినెస్ : ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ జొమాటో మాతృ సంస్థ ఎటర్నల్ వ్యవస్థాపకుడు, సిఈఓ దీపిందర్ గోయల్ పౌర విమానయాన రంగంలోకి అడుగుపెట్టేందుకు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే 'ఎల్ఏటీ ఏరోస్పేస్' పేరుతో ఏవియేషన్ వెంచర్‌ను ప్రారంభించిన ఆయన.. తాజాగా ఓ ప్రైవేటు జెట్ ను కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. బాంబర్డియర్ గ్లోబల్ సిరీస్‌కు చెందిన లగ్జరీ ప్రైవేటు జెట్‌ను ఎల్ఏటీ ఏరోస్పేస్ కొనుగోలు చేసినట్లు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ బాంబర్డియర్ విమానం ఈ ఏడాది జూన్ నుంచి న్యూఢిల్లీ ఎయిర్‌పోర్టులోని వీఐపీ బే వద్ద కనిపిస్తుంది. దీని కార్యకలాపాలు ప్రారంభం కానున్నట్లు ఆ కథనాల సమాచారం. ఈ విమానం నిర్వహణ, ఇంజినీరింగ్ బాధ్యతలను ఇందమెర్ ఎంజెట్స్ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్, బర్డ్ ఎగ్జిక్యూజెట్ ఎయిర్‌పోర్టు సర్వీసెస్ కంపెనీలకు అప్పగించినట్లు తెలుస్తోంది. కాగా.. ఈ ప్రైవేట్ జెట్ మోడల్, ఇతర ఫీచర్స్ గురించి ఇంకా పూర్తిగా తెలియాల్సి ఉంది.

దీపిందర్ గోయల్ ఇటీవలే ఓ లగ్జరీ అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేసి వార్తల్లో నిలిచిన సంగతి విదితమే. గురుగ్రామ్‌లోని డీఎల్ఎఫ్‌లో గల ఈ అపార్ట్‌మెంట్‌ను ఏకంగా రూ.52.3 కోట్లకు సొంతం చేసుకున్నట్లు వార్తలు వచ్చాయి. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం.. ఈ ఏడాది జూన్ నాటికి దీపిందర్ గోయల్‌కు జొమాటోలో 3.83 శాతం వాటాలున్నాయి.

# జన,కుల గణనలో కీలకాంశాలు!



సుదీర్ఘ జాప్యం, అనిశ్చితి అనంతరం ఎట్టకేలకు 2027లో జాతీయ జనాభా లెక్కల సేకరణ కోసం భారత రిజిస్ట్రార్ జనరల్ నోటిఫికేషన్ జారీ చేశారు. రాబోయే ఈ జనగణనలో ప్రధాన మార్పు ఏమిటంటే కులగణనను చేర్చాలని నిర్ణయించడం. కులగణనను అధికార బిజెపి, దాని సైద్ధాంతిక మాతృసంస్థ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్) చాలా కాలంగా వ్యతిరేకిస్తున్నాయి. సామాజిక న్యాయం కోసమే ఈ చర్య తీసుకోవడం జరిగిందని ఇప్పుడు బిజెపి ప్రతినిధి చెబుతున్నప్పటికీ ఈ నిర్ణయం వెనుక సూత్రబద్ధమైన నిబద్ధత కంటే రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని అర్థమవుతోంది. కోవిడ్-19 మహమ్మారి కారణంగా జనాభా లెక్కల సేకరణ ఆలస్యమైనప్పటికీ ఆ తర్వాత దానిని చేపట్టడంలో బిజెపి పెద్దగా ఆసక్తి చూపలేదు. బహుశా నియోజకవర్గాల పునర్విభజనను త్వరగా జరపాలని భావించి ఉండవచ్చు. రాజ్యాంగం ప్రకారం 2026 తర్వాత చేపట్టే తొలి జనగణన ఆధారంగా పునర్విభజన ప్రక్రియను నిర్వహించాల్సి ఉంటుంది. 2026కు ముందు జనాభా లెక్కల సేకరణ జరిపితే పునర్విభజనను చేపట్టడం సాధ్యపడదు. ఇప్పుడు 2027లో జనగణన జరపాలని నిర్ణయించినందున వెంటనే పునర్విభజన కసరత్తుకు శ్రీకారం చుట్టబోతున్నారు.

కులగణన చేపట్టాలన్న డిమాండ్లను బిజెపి నిరంతరం వ్యతిరేకిస్తూనే ఉంది. కులాల వారీగా లెక్కల సేకరణను వ్యతిరేకించాలని తాము విధానపరమైన నిర్ణయం తీసుకున్నట్లు 2021లో లోక్‌సభకు కేంద్రం తెలియజేసింది. సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో కూడా ఇదే వైఖరిని పునరుద్ఘాటించింది. ప్రధానమంత్రి స్వయంగా లోక్‌సభ ఎన్నికలకు ముందు 2023లో చేసిన ప్రసంగంలో కుల విభజనను తక్కువ చేసి మాట్లాడారు. భారతదేశంలో కేవలం నాలుగు కులాలు మహిళలు, యువత, రైతులు, పేదలు మాత్రమే ఉన్నాయని ఆయన ప్రకటించారు. కులగణన విషయంలో బిజెపి దీర్ఘకాలిక వ్యతిరేకత దాని భావజాలంలోనే ఉంది. కులగణనను సంఘ్‌పరివార్ ఎప్పుడూ అనుమానంగానే చూస్తోంది. అది హిందూ సమాజంలోని తీవ్ర అసమానతలను బయటపెడుతుందని, తాము హిందూత్వ ద్వారా కోరుకున్న ఐక్యతను దెబ్బతీస్తుందని భయపడింది. అయితే వాస్తవానికి కుల గణాంకాలు అట్టడుగు వర్గాల స్వరాన్ని పెంచుతాయని, వనరులను మరింత సమానంగా పంపిణీ చేయాలని ఆ వర్గాలు డిమాండ్ చేస్తాయని, బిజెపి-ఆర్ఎస్ఎస్ మత సమీకరణ వ్యూహాన్ని సవాలు చేస్తాయని సంఘ్‌పరివార్ ఆందోళన చెందుతోంది.

రాజకీయ యూటర్న్: అయినప్పటికీ బిజెపి తన వైఖరిని మార్చుకుంది. 2024 ఎన్నికలలో ఎదురైన పరాజయాలు, ఓబీసీ ఓటర్లలో పడిపోతున్న మద్దతును దృష్టిలో పెట్టుకొని 2027 జనగణనలో కులాల వారీ సమాచారాన్ని సేకరిస్తామని ప్రకటించింది. ఇది రాజకీయ ప్రేరేపిత మార్పుగా కన్పిస్తోంది. కులగణనను ప్రతిపక్ష పార్టీలు రాజకీయం చేస్తున్నాయని విమర్శిస్తున్న బిజెపి, వారి ప్రభావాన్ని తటస్థం చేసేందుకు వాటి డిమాండ్‌నే అందిపుచ్చుకుంది. ఆర్ఎస్ఎస్ సైతం సానుకూల వైఖరి ప్రదర్శించింది. ఎన్నికల ప్రయోజనాల కోసం ఉపయోగించనంత వరకూ కులాల సమాచారాన్ని సంక్షేమ ప్రయోజనాల కోసం వాడుకోవచ్చునని ఆర్ఎస్ఎస్‌కు చెందిన ప్రముఖ ప్రతినిధి ఒకరు తెలిపారు.

చాలా కాలంగా కుల ఆధారిత సమాచారం అందుబాటులో లేకపోవడానికి కాంగ్రెస్ కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఆ పార్టీ కులగణనను నిర్వహించలేదు లేదా మండల్ కమిషన్ సిఫార్సులను వెంటనే అమలు చేయలేదు. 2011లో సామాజిక-ఆర్థిక కులగణన (ఎస్.ఇ.సి.సి)ను చేపట్టింది కానీ దానిని ఉద్దేశపూర్వకంగానే సార్వత్రిక గణన నుండి వేరుచేసింది. ఆ తర్వాత కచ్చితత్వం లోపించిందంటూ కులగణనను పక్కన పెట్టింది. 2014లో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఎస్.ఇ.సి.సి డేటాను పూర్తిగా పక్కన పెట్టింది. దీంతో ఈ ప్రక్రియ కోసం ఖర్చు చేసిన రూ.5,000 కోట్ల ప్రజాధనం వృథా అయింది. భారతదేశంలో కులగణనకు సుదీర్ఘమైన, విభిన్నమైన చరిత్ర ఉంది. 1881 నుండి 1941 వరకూ జనాభా లెక్కల సేకరణలో కులాల సమాచారాన్ని కూడా తీసుకునే వారు. స్వాతంత్ర్యానంతరం దీనికి స్వస్తి చెప్పారు. ఇకపై జనాభా లెక్కల సేకరణలో కుల ప్రస్తావన ఉండబోదని 1950లో వల్లభ్‌భారు పటేల్ ప్రకటించారు. కుల సమాచార సేకరణను తిరిగి ప్రారంభించాలని 1953లో కాకా కాలేల్కర్ నేతృత్వంలోని వెనుకబడిన తరగతుల మొదటి కమిషన్, ఆ తర్వాత 1980లో మండల్ కమిషన్ ప్రభుత్వాన్ని కోరాయి. కచ్చితమైన సంఖ్య లేనిపక్షంలో రిజర్వేషన్లు, సంక్షేమ విధానాలు లోపభూయిష్టంగా ఉంటాయిని వాదించాయి. అయినప్పటికీ ఆ తర్వాత కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఈ సిఫార్సులను పట్టించుకోలేదు. రాబోయే జనగణనలో కులాల సమాచారాన్ని సేకరించాలని 2021లో వెనుకబడిన తరగతుల జాతీయ కమిషన్ మరోసారి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

జాతీయ స్థాయిలో కులాల సమాచారం లేకపోవడంతో అనేక రాష్ట్రాలు సొంతంగా కుల సర్వేలు ప్రారంభించాయి. స్వతంత్ర భారత చరిత్రలో తొలిసారి 1968లో కేరళలో ఇ.ఎం.ఎస్ నంబూద్రిపాద్ నేతృత్వంలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వం సమగ్ర, శాస్త్రీయ పద్ధతిలో కుల వివరాల సేకరణ కోసం కులాలు, వర్గాలపై సామాజిక-ఆర్థిక సర్వే చేపట్టింది. రాష్ట్ర జనాభాలో ఓబీసీలు, అత్యంత వెనుకబడిన తరగతుల వారు 63 శాతానికి పైగా ఉన్నారని 2023లో బీహార్‌లో నిర్వహించిన కుల సర్వే తేల్చింది. దీంతో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లను ఆ రాష్ట్ర ప్రభుత్వం 50 నుండి 65 శాతానికి పెంచింది. అయితే కోర్టు వివాదం కారణంగా దాని అమలు ఆగిపోయింది. అదే విధంగా తెలంగాణ ప్రభుత్వం 2024లో కుల సర్వే నిర్వహించి విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థలలో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ బిల్లును ఆమోదించింది. రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూలులో చేర్చడం కోసం దానిని పంపింది. కర్ణాటక సైతం తన సామాజిక-ఆర్థిక, విద్యా సర్వే ద్వారా చర్యలు చేపట్టింది. అయితే రాజకీయ అనిశ్చితులు, డేటా చెల్లుబాటుపై ఆందోళనల నేపథ్యంలో ఆ నివేదికను ఇంకా ప్రచురించలేదు.

రాష్ట్రాలవారీగా జరిగిన కుల సర్వేలు,

వివిధ వర్గాల నుంచి పెరుగుతున్న డిమాండ్లు, వాటి తక్షణ రాజకీయ ప్రయోజనాల రీత్యా కులాల వారీగా లెక్కలు సేకరించడానికి బిజెపి అంగీకరించాల్సి వచ్చింది.

2027 జనగణన రెండు దశలుగా జరుగుతుంది. 2026 అక్టోబరులో ప్రారంభమయ్యే తొలి దశలో మంచు కురిసే ప్రాంతాలలో జనగణన చేపడతారు. 2027 మార్చి 1న రెండో దశ ప్రారంభమవుతుంది. దీనిలో దేశంలోని మిగిలిన ప్రాంతాలలో జనాభా లెక్కలను సేకరిస్తా రు. జనగణనలో రెండు భాగాలు ఉంటాయి. మొదటిది గృహాలను లెక్కించడం, గృహాల గణన. ఆ తర్వాత జనాభా లెక్కలు సేకరిస్తారు. మొదటిసారిగా జనగణనను పూర్తిగా డిజిటలీకరణ చేస్తున్నారు. మొబైల్ యాప్స్, స్వీయ గణన, రియల్-టైమ్ పర్యవేక్షణను అందులో చేరుస్తారు. జనాభా లెక్కల సేకరణ దశలో కుల సమాచారాన్ని తీసుకుంటారు. గణన పూర్తయిన పది రోజులలో ప్రాథమిక సమాచా రాన్ని విడుదల చేస్తారు. అనంతరం ఆరు నెలలలో సవివరమైన విభజన డేటా విడుదలవుతుంది. ఈ కాలక్రమాన్ని పాటించినట్లయితే మొత్తం పునర్విభజన ప్రక్రియను 2029 ఎన్నికల లోగానే పూర్తి చేయవచ్చు. అయితే తన తక్షణ రాజకీయ ప్రయోజనాల కోసం ఈ మొత్తం ప్రక్రియను బిజెపి మార్చే అవకాశం కూడా ఉంది.

రాజకీయ చిక్కుముడులు, సవాళ్లు: జనగణనలో కులాన్ని చేర్చడం వల్ల వివిధ కులాల సంఖ్య, వాటి సామాజిక ఆర్థిక స్థితిగతులకు సంబంధించి విశ్వసనీయమైన సమాచారం లభిస్తుంది. రిజర్వేషన్ల పెంపు, ఓబీసీల ఉప-వర్గీకరణ, రిజర్వేషన్లపై ప్రస్తుతం అమలులో ఉన్న 50 శాతం పరిమితి తొలగింపు డిమాండ్లను బలపరచడానికి ఇది దోహదపడవచ్చు. ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన (ఇ.డబ్ల్యు.ఎస్) వారికి పది శాతం కోటా వెనుక ఉన్న హేతుబద్ధతను ధృవీకరించడానికి లేదా తిరస్కరించడానికి కూడా ఈ డేటా ఉపకరిస్తుంది. ఓబీసీల క్రీమీలేయర్ ప్రమాణాలను పరిశీలించవచ్చు. ఈ డేటా కొత్త సమాచారాన్ని వెల్లడిస్తే ఎస్సీలకు కూడా విస్తరింపజేయాలన్న డిమాండ్ ఊపందుకోవచ్చు. అన్నింటికంటే ముఖ్యంగా ప్రైవేటు రంగానికి దీనిని విస్తరించాలనే అభిప్రాయం కులగణనతో బలపడుతుంది. విశ్వసనీయ కుల సమాచారం అందుబాటులో ఉన్న పక్షంలో న్యాయస్థానాలు విధానపరమైన ప్రాతిపదికన కాకుండా మెరిట్ ఆధారంగా తీర్పు చెప్పాల్సి వస్తుంది. అయితే అనేక సవాళ్లు కూడా ఎదురవుతాయి. వివిధ ప్రాంతాలు, భాషలు, పేర్లకు సంబంధించిన సంప్రదాయాలలో వేలాది కులాలు, ఉప కులాల సమాచారాన్ని సేకరించడం ఒక గొప్ప పని. ప్రామాణికమైన వర్గీకరణ వ్యవస్థ లేకుండా సమాచారాన్ని సేకరిస్తే అది అస్థిరంగా, నిరుపయోగంగా ఉంటుంది. అధికంగా లెక్కించడం, తక్కువగా లెక్కించడం, తప్పుడు వర్గీకరణకు సంబంధించిన సవాళ్లు కూడా ఉంటాయి.

జనగణన రిజర్వేషన్లతో పాటు ఇతర ముఖ్యమైన రాజకీయ అంశాలను కూడా ప్రభావితం చేస్తుంది. ప్రధానంగా ఆందోళన కలిగించే అంశం నియోజకవర్గాల పునర్విభజన. 1976 నుండి ఈ ప్రక్రియ జరగడం లేదు. అయితే 2026 జనగణన ఆధారంగా దీనిని చేపట్టబోతున్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు కూడా జనగణన, నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే జరుగుతుంది.

అదీకాక ఇక్కడ ఒక భయాందోళన కూడా వ్యక్తమవుతోంది. జాతీయ జనాభా రిజిస్టర్ (ఎన్.పి.ఆర్)ను తాజా పరచడం కోసం దీనిని ఉపయోగించవచ్చునని, ఆ తర్వాత దానిని వివాదాస్పద జాతీయ పౌరుల రిజిస్టర్ (ఎన్.ఆర్.సి) కోసం కూడా ఉపయోగిస్తారని అనుమానిస్తున్నారు. పైగా అధికార పార్టీ విభజన ఎజెండాను ముందుకు తీసుకుపోవడానికి గణన ప్రక్రియను దుర్వినియోగం చేయవచ్చునని కూడా భయపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే జనగణనతో పాటు ఎన్.పి.ఆర్‌ను తాజా పరచరాదన్న డిమాండ్ బలపడుతోంది. జనగణన సమాచారాన్ని విస్తృతంగా ఉపయోగించవచ్చు. దానిని సక్రమంగా ఉపయోగించుకుంటే విధాన రూపకల్పనకు, ప్రభుత్వ వనరుల పంపిణీకి మార్గదర్శనం చేయడానికి దోహదపడుతుంది. విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాల పర్యవేక్షణకు మంత్రిత్వ శాఖలకు ఈ సమాచారం తప్పనిసరి. వలసలు, ఉపాధి, సామాజిక చలనశీల ధోరణులను అర్థం చేసుకోవడానికి విధాన నిర్ణేతలకు సాయపడుతుంది.

కుల సమాచారం ఉపయుక్తమైనదే అయినప్పటికీ అది అన్నింటికీ మందు కాదు. కుల సమాచారం అందుబాటులో ఉన్నచోట కూడా ఎస్సీ, ఎస్టీలలో అసమానతలు వేళ్లూనుకుపోయి ఉన్నాయి. కేవలం కులగణన ద్వారా న్యాయం చేకూరదు. కుల వ్యవస్థ నిర్మూలన కోసం పోరాడడంలో మన నిబద్ధతను అనవసరమైన భ్రమలు బలహీనపరుస్తాయి. ముఖ్యంగా మోడీ ప్రభుత్వ హయాంలో నయా ఉదారవాద విధానాలు సంక్షేమ కార్యక్రమాలను బలహీనపరిచాయి. ప్రైవేటీకరణను ప్రోత్సహించాయి. ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించాయి. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఉద్దేశించిన పథకాలను నీరుకార్చాయి. ఈ వ్యవస్థీకృత సమస్యలను సవాలు చేయని పక్షంలో కులగణన మాత్రమే పేదలు, అణగారిన వర్గాల జీవితాలను మార్చదు.

అయినా న్యాయం కోసం జరిపే పోరాటంలో కుల సమాచారం ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగపడుతుంది. అసమానతల నిజ స్వభావాన్ని బహిర్గతం చేయడానికి, ప్రస్తుత విధానాల వైఫల్యాన్ని బయటపెట్టడానికి, కుల ఆధారిత రాజకీయాలను ఎండగట్టడానికి ఇది సాయపడుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే

కులాల వారీగా జనాభా లెక్కలు సేకరిస్తే కులాలకు అతీతంగా నిర్మాణాత్మక మార్పుల కోసం పోరాడే విస్తృత ఉద్యమం ఊపిరి పోసుకుంటుంది. నాణ్యమైన విద్య, ఆరోగ్య సంరక్షణ, గృహ నిర్మాణం, భూసంస్కరణలు, ఉపాధి హామీలు, ప్రభుత్వ సేవల కల్పనలో సార్వత్రిక ప్రవేశం లభిస్తుంది.

# సొంత జిల్లాకు మంత్రి దూరం..?!

అదిలాబాద్: రాష్ట్ర మంత్రి అంటే రాష్ట్రంలో ఎక్కడికైనా వెళ్లిరావచ్చు.. కానీ, ఓ మంత్రి మాత్రం తన సొంత పార్టీ ఎమ్మెల్యే నియోజకవర్గంలో మాత్రం కాలు పెట్టలేకపోతున్నారు. కాదు.. కాదు.. కాలు పెట్టనివ్వడం లేదు. మంత్రి మా నియోజకవర్గంలోకి రావొద్దంటూ సొంత పార్టీ నేతలే హెచ్చరించడంతో మంత్రి అటువైపు కనీసం కన్నెత్తి కూడా చూడటం లేదు. ఇటీవలే కొత్తగా మంత్రి వర్గంలోకి వచ్చిన చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకట్‌స్వామికి సొంత పార్టీ కాంగ్రెస్‌లో, పైగా సొంత జిల్లాలోనే తలనొప్పులు తప్పడం లేదు. ఎన్నికల వరకు వేరే పార్టీలో ఉన్న వివేక్ వెంకట్ స్వామి ఎన్నికల ముందే కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఆయన వచ్చీ రావడంతోనే తనకు, తన అన్న వినోద్ కు టిక్కెట్టు సాధించుకున్నారు. అంతేకాకుండా, తన కొడుకు వంశీకి సైతం పెద్దపల్లి ఎంపీ టిక్కెట్టు సాధించారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీలుగా తండ్రీకొడుకు గెలుపొందారు. ఇదంతా ఒక్కెత్తు కాగా, మరో బంపర్ ఆఫర్ కొట్టేశారు. కొద్ది రోజుల కిందట జరిగిన మంత్రి వర్గ విస్తరణలో మంత్రి కూడా అయ్యారు. అయితే, ఇన్ని రోజులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మంత్రి పదవిపై ఆశపెట్టుకున్న మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావ్ అగ్గి మీద గుగ్గిలం అయ్యారు. తాను ఎన్నో ఏండ్లుగా పార్టీని పట్టుకుని ఉంటున్నానని, బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో సైతం ఆయన పార్టీనే అంటిపెట్టుకుని ఉన్నానని, తనపై ఎన్నో కేసులు కూడా నమోదు అయినా, వాటన్నింటిని ఎదుర్కొని కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేశానని ప్రేంసాగర్ రావ్ స్పష్టం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ లో నిర్వహించిన భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్ర, ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే బహిరంగ సభను సైతం విజయవంతం చేయడంలో ప్రేమ్ సాగర్ రావ్ కీలకపాత్ర పోషించారు. కాంగ్రెస్ అధిష్టానం ఏం ఆలోచించిదో ఏమో కానీ... ప్రేమ్ సాగర్ రావ్ ను కాదని వివేక్ కు మంత్రి పదవి కట్టబెట్టింది. దీంతో అటు ప్రేం సాగర్ రావ్, ఆయన అనుచరవర్గం ఇప్పుడు వివేక్ అంటే మండి పడుతున్నారు. తాము ఎన్నో ఏండ్లుగా కష్టపడి పార్టీని కాపాడుకుంటూ వస్తే కేసులకు భయపడకుండా, ఒత్తిళ్లకు తలొగ్గకుండా కాంగ్రెస్ పార్టీలోనే ఉంటే.. అన్ని పార్టీలు తిరిగి వచ్చిన వివేక్ ను మంత్రి చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్ లో ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావ్ ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి మంత్రి పదవి గురించి నిలదీశారు. పార్టీ కోసం కష్టపడ్డది తామైతే ఫలితం దక్కింది మరొకరికి అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆయనకు చీఫ్ విప్ పదవి ఇవ్వాలని అధిష్టానం భావించింది కానీ ఆ ఆఫర్ ను ప్రేమ్ సాగర్ రావ్ తిరస్కరించారు. తనకు మంత్రి పదవి తప్ప వేరే ఏం వద్దంటూ అక్కడి నుంచి వెళ్ళిపోయారు. దీంతో తెలంగాణ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఆయనను కలిసి బుజ్జగించి.. మరో మంత్రి వర్గ విస్తరణలో అవకాశం కల్పించే దిశగా కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ తమ నేతకు అన్యాయం చేసిందని ఆగ్రహంతో ఉన్న ప్రేమ్ సాగర్ రావ్ అనుచరులు తమ నేతకు దక్కాల్సిన మంత్రి పదవి గద్దలా తన్నుకుపోయిన గడ్డం వివేక్ పై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఎంపీ ఎన్నికల సమయంలో తన కొడుకు వంశీకృష్ణను గెలిపిస్తే ప్రేంసాగర్ రావ్ మంత్రి పదవికి తాను అడ్డురానని చెప్పిన వివేక్.. తీరా మంత్రి కావడం వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రేంసాగర్ రావ్ ఆయన అనుచరవర్గం తమ నియోజకవర్గంలో అడ్డుపెట్టొద్దని ఏకంగా మంత్రి వివేక్ కే అల్టిమేటం జారీ చేశారు. ఒకవేళ మంత్రి మంచిర్యాల వస్తే గొడవలు తప్పవని, ఆయనను మంచిర్యాల అడుగుపెట్టనీయమని ప్రతిజ్ఞ చేశారు. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావ్ సైతం నా నియోజకవర్గంలో నేనే రాజు.. నేనే మంత్రి అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు అండగా నిలిచి వారికి న్యాయం చేసేలా తాను ముందుంటానన్నారు. దీంతో మంత్రి వివేక్ సైతం ఆయన నియోజకవర్గంలో ఎందుకైనా మంచిదని, ఆ నియోజకవర్గానికి దూరంగా ఉంటున్నారు. జిల్లా కేంద్రమైన మంచిర్యాలలో అడుగుపెట్టకుండా మంత్రి వివేక్ సైతం జాగ్రత్త పడుతున్నారు. మంత్రి పదవి ప్రమాణ స్వీకారం చేసినప్పుడు సైతం ఇందారం మీదుగా చెన్నూరు నుంచి అటు వైపుగా మందమర్రి వెళ్లిన మంత్రి మంచిర్యాలలో తన నివాసానికి వెళ్ళి హైదరాబాద్ కు వెళ్ళిపోయారు. ప్రేంసాగర్ రావ్, ఆయన అనుచరుల హెచ్చరికల వల్ల.. పార్టీ పెద్దలను సైతం నొప్పించడం ఇష్టంలేక మంత్రి వివేక్ వెంకటస్వామి మంచిర్యాల నియోజకవర్గానికి రావడం లేదు. తన నియోజకవర్గ అభివృద్ధి ఆగకుండా చూసుకుంటున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావ్, ఆయన అనుచరులు మంత్రిని మాత్రం నియోజకవర్గంలో అడుగుపెట్టనిచ్చేది లేదని భీష్మించుకున్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లాలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సహా ముగ్గురు మంత్రులు జిల్లా ఇన్చార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పర్యటించి.. మంచిర్యాల నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి మరికొన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఉప ముఖ్యమంత్రి సహా, ముగ్గురు మంత్రులు తన సొంత జిల్లాకు వచ్చినప్పటికీ ఈ కార్యక్రమానికి సైతం మంత్రి వివేక్ హాజరుకాలేదు. అటూ మంచిర్యాల జిల్లాలో ఉప ముఖ్యమంత్రి సహా ముగ్గురు మంత్రుల పర్యటన ఉంటే వివేక్ వెంకటస్వామి మాత్రం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించడం అంటే అక్కడ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే మరో మంత్రి వర్గ విస్తరణలో ప్రేమ్ సాగర్ రావ్ కు అధిష్టానం అవకాశం కల్పిస్తుందా..? మరి రానున్న రోజుల్లో మంత్రిగా వివేక్ ఎప్పుడైనా మంచిర్యాల నియోజకవర్గంలో అడుగు పెడతారా.. అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారా..? అంటే మరికొద్ది రోజులు వేచి చూడాలి. ఈ విషయం ఇప్పుడు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

# మత్తు పదార్థాల కట్టడికి కఠిన చర్యలు

హైదరాబాద్, : వ్యసనం అనేది ఏడూళ్ల ప్రయాణం లాంటిదని వెనకటికి పెద్దలు చెప్పేవారు. అది ఎంత నిజమో మరోసారి తేలింది. భాయ్ బచ్చ ఆగయా అని పోలీసులు మెసేజ్ చేయడమే ఆలస్యం.. 14 మంది దాకా వచ్చారు. వారిలో ఐటీ ఉద్యోగులు ఉన్నారు. విద్యార్థులు ఉన్నారు. ప్రాపర్టీ మేనేజర్లు కూడా ఉన్నారు. వీరందరిలో నాలుగు సంవత్సరాల కొడుకు ఉన్న జంట కూడా వచ్చింది. వీరంతా వచ్చింది వారి కేసుల పరిష్కారానికో.. ఇంకోదానికో కాదు.. సమాజం అత్యంత హేయంగా భావించే ఓ పదార్థం కోసం.. అలా పదార్థం కోసం వచ్చి చిక్కిపోయారు. పోలీసుల చేతిలో అడ్డంగా బుక్కయ్యారు.. తెలంగాణ రాష్ట్రంలో మత్తు పదార్థాల కట్టడికి ప్రభుత్వం అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటున్నది. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో అక్రమాలు.. ఆక్రమణలు.. అతిక్రమణలు జరగకుండా హైడ్రా అనే వ్యవస్థను తెరపైకి తీసుకొచ్చింది. ఆక్రమణ లకు గురైన చెరువులకు జీవంపోస్తోంది.ఇదే క్రమంలో మత్తు పదార్థాలకు బానిసలై తెలంగాణ ప్రజలు ఆగం కావద్దు అనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈగల్ అనే వ్యవస్థను తెరపైకి తీసుకువచ్చారు. ఈగల్ అనేది తెలంగాణ పోలీసింగ్లో ఒక ప్రత్యేకమైన విభాగం. ఈ విభాగం మఫ్టీలో పనిచేస్తుంది. మామూలుగా అయితే హైదరాబాద్ నగరంలో పబ్‌లు, క్లబ్‌లు, రెస్టారెంట్లపై పోలీసులు తరచూ దాడులు చేస్తుంటారు. మత్తు పదార్థాలు స్వీకరించే వారిపై నిఘా పెడతారు. వారికి పరీక్షలు నిర్వహించి అదుపులోకి తీసుకుంటారు. ఆ తర్వాత కౌన్సిలింగ్ నిర్వహించి డి అడిక్షన్ సెంటర్ కు పంపిస్తారు. మత్తు పదార్థాలు తీసుకున్నారని సమాచారం అందినప్పుడు మాత్రమే పోలీసులు రంగంలోకి దిగుతారు. అయితే రేవంత్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈగల్ అనే వ్యవస్థ ఇందుకు పూర్తి భిన్నమైనది. మత్తు పదార్థాల మూలాలను దెబ్బ కొట్టడానికి ఈ వ్యవస్థను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రభుత్వ ఆశయాల మేరకు ఈ విభాగం పని చేస్తోంది. ముఖ్యంగా మత్తు పదార్థాలను విక్రయించే వారిపై ఉక్కు పాదం మోపుతోంది. వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నది. విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం సేకరించి.. మత్తు పదార్థాల మూలాలను పెకిలించే ప్రయత్నం చేస్తున్నది. అందువల్లే హైదరాబాదులో మత్తు పదార్థాలు ఒక పట్లగా ఇప్పుడు లభ్యం కావడం లేదు. మత్తు పదార్థాల రాకను ప్రభుత్వం తొక్కి పెట్టిన నేపథ్యంలో.. వేరే మార్గాల వైపు అక్రమార్కులు చూస్తున్నారు. అయితే ఇప్పుడు ఆ ప్రయత్నాలను



కూడా తొక్కి పెట్టడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. హైదరాబాద్ నగరంలో భిన్న వర్గాల ప్రజలు ఉంటారు. భిన్న వ్యాపారాలు కూడా సాగుతుంటాయి. అయితే కొంతమంది తాత్కాలిక ఆనందం కోసం.. విపరీతమైన మత్తు కోసం చట్ట విరుద్ధమైన పదార్థాలను స్వీకరిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం ఈగల్ అనే వ్యవస్థను తెరపైకి తీసుకురావడం వల్ల వీరికి మత్తు పదార్థాల రాక ఆగిపోయింది. దీంతో ప్రత్యామ్నాయ మార్గాల వైపు చూస్తున్నవారికి పోలీసులు మరోసారి షాక్ ఇచ్చారు. హైదరాబాదులో మత్తు పదార్థాల వినియోగదారులను పక్కా స్కెచ్ తో ఈగల్ సభ్యులు పట్టుకున్నారు. ఇటీవల ఈగల్ సభ్యులు నిర్వహించిన ఓ ఆపరేషన్లో సందీప్ అనే మత్తు పదార్థాల డీలర్ అరెస్ట్ అయ్యాడు. అతని ఫోన్లో ఉన్న 100 మందికి పోలీసులు భాయ్ బచ్చ ఆగయా అనే పేరుతో మెసేజ్ చేశారు. దీంతో రెండు గంటల్లో 14 మంది పోలీసులు చెప్పిన లొకేషన్ కు వచ్చారు. ఇందులో భిన్న వర్గాల ప్రజలు ఉన్నారు. ఓ జంట తమ నాలుగు సంవత్సరాల కుమారుడితో పోలీసులు చెప్పిన లొకేషన్ కు రావడం ఆశ్చర్యాన్ని కలిగించింది. పోలీసులు నిర్వహించిన పరీక్షలలో వారందరూ మత్తు పదార్థాలు తీసుకున్నట్టు తేలింది. దీంతో వారందరినీ డి అడిక్షన్ సెంటర్ కు తరలించారు. ఇటీవల ఈగల్ ప్రత్యేకమైన ఆపరేషన్ చేపట్టింది. ఇందులో సందీప్ అనే డీలర్ దొరికిపోయాడు. అతన్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించడం మొదలుపెట్టారు. తద్వారా అతడు చెప్పిన వివరాల ఆధారంగా మత్తు పదార్థాలు విక్రయించే వ్యక్తులపైన ఉక్కు పాదం మోపుతున్నారు. అంతేకాదు మత్తు పదార్థాలు కొనుగోలు చేసే వారిపై కూడా కఠిన వైఖరి అవలంబిస్తున్నారు. దీంతో ఈగల్ అంటే హడల్ ఏర్పడింది. ముఖ్యమంత్రి రేవంత్ తీసుకువచ్చిన ఈ వ్యవస్థ పట్ల ప్రజలకు సదాభిప్రాయం కలుగుతోంది

# జేఎన్టీయూలో 60 లక్షల ప్యాకేజీ!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ)లో బీటెక్ చివరి ఏడాది చదువుతోన్న విద్యార్థి జాక్ పాట్ కొట్టాడు. అతడికి రూ.60 లక్షల ప్యాకేజీతో అద్భుతమైన ఆఫర్ వచ్చింది. ఓ సాఫ్ట్‌వేర్ సంస్థ అతడికి నెలకు రూ.2 లక్షలఉపకార వేతనంతో పాటు, అదనంగా రూ.60 లక్షల వేతన ప్యాకేజీని ఆఫర్ చేసింది. నిరుపేద కుటుంబానికి చెందిన ఆ యువకుడు తన ప్రతిభతో ఈ ఘనత సాధించాడు. వివరాల్లోకి వెళ్తే.. ప్రఖ్యాత సాఫ్ట్‌వేర్ అండ్ ఫైనాన్షియల్ ట్రేడింగ్ కంపెనీ 'డీఈ షా' క్యాంపస్ ఇంటర్వ్యూ నిర్వహించింది. ఒక్క ఉద్యోగం కోసంకంప్యూటర్ సైన్స్, ఏఐఎంఎల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూ నికేషన్స్ విభాగాల నుంచి దాదాపు 200 మంది విద్యార్థులు పోటీ పడ్డారు. అనేక పరీక్షల తరువాత, ఖమ్మంకి చెందిన విద్యార్థి షేక్ సోహెల్ ఫైనల్ ఇంటర్వ్యూలో విజేతగా నిలిచాడు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల్లో చదివే విద్యార్థులకే కంపెనీలు అధిక ప్యాకేజీలు ఆఫర్లు చేస్తున్న సంగతి తెలిసిందేతనకు ఎంత పరిజ్ఞానం ఉందనే దానికంటే, సమస్యను పరిష్కరించిన విధానం డీఈ షా కంపెనీ ప్రతినిధులను ఆకట్టుకుందని సోహెల్ తెలిపాడు. 'ఇచ్చిన 30 నిమిషాల్లోనే అన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పి, అందరికన్నా ఎక్కువ మార్కులు తెచ్చుకున్నాను' అని సోహెల్ చెప్పాడు.ఉన్నత చదువులతో మంచి ఉద్యోగం సాధించాలనే తన కలకురెక్కలు ఇచ్చి.. ఎగిరేలా స్ఫూర్తినిచ్చింది హైదరాబాదే అని సోహెల్ ఆనందం వ్యక్తం చేశాడు. ఖమ్మం జిల్లాకు చెందిన సోహెల్.. ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న కుటుంబం నుంచి వచ్చాడు.



ఆరేళ్ల క్రితం తన తండ్రి బడేమియా అనారోగ్యంతో చనిపోయాడని.. అప్పటి నుంచి తల్లి చాన్‌బాను అన్నీ తానై చూసుకుందని చెప్పాడు. తన విజయానికి ఆమె మద్దతు ఎంతో ఉందని సోహెల్ తెలిపాడు. సోహెల్ ప్రస్తుతం బీటెక్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్) చివరి ఏడాది చదువుతున్నాడు.

భారీ ప్యాకేజీతో ఉద్యోగం పొందిన సోహెల్‌కు జేఎన్టీయూ ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. ఐఐటీ బాంబే విద్యార్థు లకు భారీ ప్యాకేజీతో ఉద్యోగాలు లభిస్తుంటాయి.కాగా, గతేడాది కూడా జేఎన్‌టీయూకు చెందిన విద్యార్థినికి డీఈ షా రూ.52 లక్షల ప్యాకేజీ ఆఫర్ చేసింది. గత ఫిబ్రవరిలో ఒక్క ఉద్యోగం కోసం డీఈ షా క్యాంపస్ ఇంటర్వ్యూ నిర్వహించగా.. వంద మందికిపైగా హాజరయ్యారు. వీరిలో చల్లా సాయికృతి అనే అమ్మాయిని గోల్డెన్ ఆఫర్ వరించింది. మూడు రౌండ్ల అనంతరం సాయికృతిని ఎంపిక చేశారు. కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన ఆమె.. అక్క స్ఫూర్తితో సాఫ్ట్‌వేర్ రంగంలోకి వెళ్లాలని నిర్ణయించుకుంది.

# రైళ్లలో సీసీటీవీలు




ముంబై, ,: భారతీయ రైల్వే ప్రయాణికుల భద్రతను పెంపొందించే దిశగా ఒక అద్భుతమైన, సమగ్రమైన ప్రణాళికను ఆవిష్కరించింది. దేశవ్యాప్తంగా మొత్తం 74,000 ప్యాసింజర్ కోచ్‌లు, 15,000 సరుకు రవాణా లోకోమోటివ్‌లలో అత్యాధునిక సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే శాఖ తాజాగా ప్రకటించింది. అయితే రైలు 100 కిలో మీటర్ల వేగంతో వెళ్తున్నా దృశ్యాలు అత్యంత నాణ్యంగా వచ్చేలా ఇవి పని చేయబోతున్నట్లు పేర్కొంది. ఈ బృహత్తర ప్రాజెక్ట్ ప్రయాణ అనుభవాన్ని మెరుగు పరచడమే కాకుండా రైళ్లలో జరిగే నేరాలకు అడ్డుకట్ట వేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.ఈ సీసీటీవీల ఏర్పాటుకు ప్రధాన లక్ష్యం ప్రయాణికుల భద్రతను గణనీయంగా పెంచడం. రైళ్లలో జరిగే వస్తువుల దొంగతనాలను నియంత్రించడం. అలాగే అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని తక్షణమే గుర్తించి చర్యలు తీసుకోవడం. తద్వారా నేరాలను నివారించడం వంటి కీలక ఉద్దేశాలతో ఈ కెమెరాలను అమర్చుతున్నారు. రైల్వే అధికారులు ఈ చర్యల ద్వారా ప్రయాణికులు మరింత సురక్షితంగా, నిశ్చింతగా ప్రయాణించగలరని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ప్రతి ప్యాసింజర్ బోగీలో ప్రయాణికుల గోప్యతకు భంగం కలగకుండా, వారి కదలికలు ఎక్కువగా ఉండే ద్వారాల వద్ద మొత్తం 4 డోమ్ సీసీటీవీ కెమెరాలను అమర్చుతారు. అంటే ప్రతి ప్రవేశ మార్గం వద్ద రెండు కెమెరాలు ఉంటాయి. అదేవిధంగా ప్రతి లోకోమోటివ్‌లో 6 సీసీటీవీ కెమెరాలను వ్యూహాత్మకంగా ఏర్పాటు చేస్తారు. లోకోమోటివ్ ముందు, వెనుక భాగాలలో ఒక్కో కెమెరా, కార్‌కు రెండు వైపులా డోమ్ టైప్ కెమెరాలతో పాటు, డ్రైవర్ క్యాబిన్‌లో డ్రైవర్ కార్యకలాపాలను పర్యవేక్షించడానికి రెండు డెస్క్ మౌంటెడ్ మైక్రోఫోన్ కెమెరాలు కూడా ఉంటాయి. ఈ సీసీటీవీ కెమెరాలన్నీ అత్యాధునిక సాంకేతికతతో, సర్టిఫికేషన్‌తో వస్తాయి. ఇది వాటి నాణ్యతకు హామీ. రైలు గంటకు 100 కిలో మీటర్ల కంటే ఎక్కువ వేగంతో ప్రయాణిస్తున్నా లేదా తక్కువ కాంతి పరిస్థితుల్లో కూడా స్పష్టమైన చిత్రాలను, వీడియోలను రికార్డు చేయగల సామర్థ్యం వీటికి ఉంది.ఈ భారీ ప్రాజెక్టును అమలు చేయడానికి ముందు ఉత్తర రైల్వే విభాగంలో ఎంపిక చేసిన ప్యాసింజర్ బోగీలు, లోకోమోటివ్‌లలో ప్రయోగాత్మకంగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి విజయవంతంగా పరీక్షించారు. సానుకూల ఫలితాల అనంతరం రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ విస్తృత ప్రాజెక్టుకు ఆమోదం తెలిపారు. భవిష్యత్తులో సీసీటీవీ డేటాను విశ్లేషించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్సాంకేతికతను వినియోగించుకోవాలని కూడా రైల్వే మంత్రి సూచించారు. ఇండియా ఏఐ మిషన్ సహకారంతో ఈ కెమెరాల డేటాను విశ్లేషించి, అసాధారణ పరిస్థితులను గుర్తించి, భద్రతా చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ చర్యలన్నీ భారతీయ రైల్వేలను భద్రతలో ఒక అడుగు ముందుకు వేయిస్తాయని ఆశిస్తున్నారు.

# ఆ ఎనిమిది సంగతి అంతేనా..?

**మెదక్,తెలంగాణ దిశ :** గత నెల 30వ తేదీన సిగాచీ రసాయన పరిశ్రమలో ప్రమాదం జరిగింది. సహాయక చర్యలు పూర్తిగా నిలిపివేశారు. కర్మాగారాన్ని కూడా మూడు నెలల పాటు మూసివేస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. అయితే ఎనిమిది మంది కార్మికుల జాడ మాత్రం ఇంత వరకూ దొరకలేదు. ప్రమాదం జరిగి దాదాపు పదిహేను రోజులు దాటుతున్నప్పటికీ ప్రమాదం సమయంలో కంపెనీలో పనిచేస్తున్న ఎనిమిది మంది దొరకకపోవడంతో వారు కుటుంబ సభ్యులు కూడా ఆశలు వదులుకు ని వారి సొంత ఊళ్లకు వెళ్లిపోయారు. జాడ తెలియని ఆ ఎనిమిది మంది కాలి బూడిదయిపోయి ఉంటారని, అందుకే కనీసం శరీరభాగా లు కూడా దొరకడం లేదని అధికారులు చెబుతున్నారు. తప్పిపోయిన వారినిరాహుల్, రవి, వెంకటేష్, ఇర్ఫాన్, విజయ్, అఖిలేశ్, జస్టిన్, శివాజీలుగా గుర్తించారు. కానీ చివరి చూపు కూడా దక్కకుండా, కనీసం వారి అస్థికలను కూడా నిమజ్జనం చేయడానికి లేకుండా పోయిందని కుటుంబ సభ్యులు ఆవేదన చెందుతున్నారు. పది హేను రోజులు దాటుతుండటంతో సహాయక కార్యక్రమాలను నిలిపేస్తున్నట్లు ప్రకటించారు. ఏదైనా సమాచారం అందితే తాము మళ్లీ పిలుస్తామని ఎనిమిది మందికి సంబంధించిన కుటుంబ సభ్యులను వారి స్వస్థలాల కు పంపించి వేశారు. మరొకరు మర ణించడంతో... కాగా పరిశ్ర మలో జరిగిన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మరొక కార్మికుడు మరణించాడు. పశ్చిమబెం గాల్ కు చెందిన తరపాడుతుడు అనే కార్మికుడు మదీనాగూడలోని ఒక ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించడంతో మరణించిన వారి సంఖ్య నలభై ఐదుకు చేరింది. అక్కడ లభించిన మానవ శరీర భాగాలను డీఎన్ఏ రిపోర్టుల కోసం పంపినా అందులో కూడా తేలలేదు. దాదాపు 70 వరకూ నమూనాలను సేకరించి పం పారు. ఈ మొత్తం వ్యవహారంపై ఆచూకీ దొరకని మృతుల కుటుంబ సభ్యుల వాదన మరోలా ఉంది. మృతదేహాల వెలికితీతలో మొదటి నుంచి తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపిస్తున్నారు. సాధ్యమైనంత వేగంగా శిథిలాల తొలగింపు చే యాల్సి ఉండగా, నెమ్మదిగా తొలగింపు ప్రక్రియ జరగడంతో మృతదేహాల గుర్తింపు కష్టమవ్వడంతో పాటు,మాంసపు ము ద్దలుగా విడిపోవడం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పది రోజులైనా ఆచూకీ లభించకపోవడంతో ఇప్పుడు మావల్ల కాదంటూ చేతులెత్తేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదంలో మృతుల ఆచూకీ లభించలేదని సర్టిఫికేట్ ఇవ్వమని వారి కుటుంబ సభ్యులు అడిగినా పట్టించుకోవడంలేదు. మేము నిర్ధారించము, మూడు నెలల తరువాత రండి అప్పుడు చూద్దామం టూ తేల్చిచెప్పడం దిక్కుతోచని స్దితిలో ఆచూకీ దొరకని 8 మందికి చెందిన కుటుంబ సభ్యులు ఒక్కొక్కరుగా వెనుదిరిగి తమ సొంత రాష్ట్రాలకు వెళ్లిపోతున్నారు. సిగాచీ యాజమాన్యం ఘటనా స్దాలానికి చేరు కోలేదు. డబ్బుతో ఏదైనా సాధ్యమే అన్నట్లుగా యాజమాన్యం తీరు కనిపిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పరిహారం ప్రకటించాం. మృతదేహాల కోసం ఆలోచించాల్సిన పనేలేదు అన్నట్లుగా వ్యవహరించిందనే ఆరోపణలు వెల్లుతెత్తున్నా యి. ఐదు నెలల క్రితమే పెళ్లైన ఉప్పల్ కు చెందిన అఖిల్ ఫ్యాక్టరీలోకి వచ్చినట్లు భార్యకు మెసేజ్ పెట్టిన పదినిమిషాల్లోనే బ్లాస్ట్ జరిగింది. తండ్రికి ఏకైక ఆధారంగా ఉన్న జస్టిన్ ఇక తిరిగి రాడని తెలిసిన తండ్రి దిక్కుతోచని స్దితిలో బోరున విలపిస్తున్నాడు.

శ్రీకాకుళం నుంచి ఉపాధి కోసం వచ్చిన వెంకటేష్ పరిస్దితి మరింత దయనీయం. తండ్రిని కంటికి రెప్పలా కాపాడుకునే వెంకటేష్ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడనే వార్త టివిలో చూసి నిర్ఘాంతపోయారు. సిగాచీ వద్దకు వచ్చిన తండ్రి, కాళ్లరిగేలా తిరిగి, బిడ్డకోసం చూసిన ఎదురు చూపులు ఇంకా సిగాచీ యాజమాన్యాన్ని ప్రశ్నిస్తునే ఉన్నాయి.నా బిడ్డఎముకలైనా ఇవ్వండై య్యా అని వేడుకున్నా ఆలకించేవారు లేరు.కాగా నలుగురు సభ్యులతో పాశమైలారం సిగాచీ పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై ప్రభుత్వం నియమించిన కమిటీ నివేదిక సమర్పించడానికి ఇంకా పదిహేను రోజులు మాత్రమే సయం ఉంది. మరి కమిటీ నివేదికలో ప్రమాదానికి గల కారణం తెలుస్తుందా? లేదా? అన్నది తెలియాల్సి ఉంది.

# రెండో భూ సేకరణకు బ్రేక్..?

**అమరావతి,తెలంగాణ దిశ:** అమరావతి రెండో విడత భూ సేకరణ విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గిందా? సీఎం చంద్రబాబు పునరాలోచనలో పడ్డారా? తాత్కాలికంగా వాయిదా వేయడానికి సిద్ధపడ్డారా? క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయనున్నారా? అమరావతి రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టనున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జూన్ 25న జరిగిన క్యాబినెట్ సమావేశంలో అమరావతి భూ సేకరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గత కొద్దిరోజులుగా అమరావతి ప్రాంతంలో అదనపు భూముల సేకరణకు సంబంధించి ప్రక్రియ ప్రారంభం అయింది. అయితే గతం మాదిరిగా అమరావతి రైతుల నుంచి అనుకున్న స్థాయిలో ఆసక్తి మాత్రం కనిపించలేదు. దీంతో తాజాగా జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ విషయం చర్చకు వచ్చింది. డిప్యూటీ సీఎం పవన్ తో పాటు మంత్రుల అభిప్రాయం మేరకు చంద్రబాబు ఈ విషయంలో వెనక్కి తగ్గినట్లు ప్రచారం సాగుతోంది.కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతికి కొత్త కళ వచ్చింది. ముందుగా జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభమయ్యాయి. అమరావతి యధా స్థానానికి వచ్చింది. అదే సమయంలో గత ఏడాదిగా నిధుల సమీకరణ పై దృష్టి పెట్టింది కూటమి ప్రభుత్వం. కేంద్ర ప్రభుత్వ హామీతో ప్రపంచ బ్యాంకు తోపాటు ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంక్ నుంచి 15 వేల కోట్ల రూపాయల రుణం అందింది. ఇతర మార్గాల్లో సైతం నిధుల సమీకరణ పూర్తయింది. దీంతో టెండర్లు ఖరారు అయ్యాయి. మరో రెండు నెలల్లో వేలాదిమంది ఇంజనీర్ల పర్యవేక్షణలో అహోరాత్రులు పనులు చేయించి అమరావతి నిర్మాణ పనులను కొలిక్కి తేవాలని ప్రభుత్వం భావిస్తోంది.అయితే అంతర్జాతీయ నగరాల సరసన అమరావతిని చేర్చాలని చంద్రబాబు సర్కార్ గట్టి సంకల్పంతో ఉంది. అందుకే అదనంగా మరో 35 వేల ఎకరాల భూమిని సేకరించాలని భావించింది. అంతర్జాతీయ విమానాశ్రయం తో పాటు మరికొన్ని నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రణాళిక వేసుకుంది. ఓ పదివేల ఎకరాల భూమిని ప్రభుత్వం తన వద్ద ఉంచుకోవాలని చూసింది. అయితే ఇది మంచి ఆలోచన అయినా.. అమరావతి రైతుల్లో అనేక రకాల అనుమానాలు ప్రారంభం అయ్యాయి. గత ఐదేళ్ల వైసిపి విధ్వంసాన్ని గుర్తించుకొని.. లేనిపోని ఇబ్బందులు ఎందుకన్నది అమరావతి రైతుల అభిప్రాయం. చంద్రబాబు సమర్థతపై వారికి నమ్మకం ఉన్నా.. ఒకవేళ భవిష్యత్తులో అధికారం మారితే పరిస్థితి ఏంటన్న అనుమానం మాత్రం వారిని వెంటాడుతోంది. అందుకే వారంతా ఈ అదనపు భూసేకరణను వ్యతిరేకిస్తున్నారు.తాజాగా జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఇదే విషయాన్ని ప్రస్తావించారు కొందరు మంత్రులు. అదనపు భూసేకరణకు అమరావతి రైతులు వ్యతిరేకిస్తున్నారని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రస్తావించారు. అదే సమయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సైతం స్పందించారు. అదనపు భూసేకరణ పేరుతో లేనిపోని ఇబ్బందులు ఎందుకని అన్నారు. అమరావతి రాజధాని భూ సేకరణకు సంబంధించి మంత్రులు ఇష్టారాజ్యంగా ప్రకటనలు చేయడాన్ని కూడా ప్రస్తావించారు. ఇప్పటివరకు అమరావతి రాజధానిని వ్యతిరేకించిన వైసీపీ వర్గాలకు ఇది అవకాశం ఇచ్చినట్టు అవుతుందని కూడా చెప్పుకొచ్చారు. దీంతో చంద్రబాబు ఆలోచనలో పడ్డారు. టిడిపి కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా జనసేన అధినేత పవన్ మాట్లాడిన సందర్భం కూడా ఇది తొలిసారి. దీనిపై చంద్రబాబు స్పందించారు. క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటుచేసి అమరావతి రైతుల నుంచి అభిప్రాయాలు తీసుకుందామని చెప్పారు. అందుకే ఇప్పుడు అమరావతిలో అదనపు భూసేకరణకు సంబంధించి ప్రక్రియ నిలిచిపోయినట్లు తెలుస్తోంది.

# ఎన్నికల సంఘానికి అపరిమిత అధికారాలు లేవు..?

ఈ ఏడాది నవంబరులో ఎన్నికలు జరగనున్న బీహార్‌లో ఎన్నికల జాబితాకు ప్రత్యేక సమగ్ర సవరణను (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) నిర్వహించాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీచేసింది. బీహార్‌లో లక్షలాది మంది ప్రజానీకాన్ని వారు భారతీయ పౌరులు కాదనే సాకున ఓటింగ్‌లో పాల్గొనడానికి అవకాశం లేకుండా చేసే దుష్ట తలంపుతో ఎన్నికల సంఘం ఈ చర్చకు ఉపక్రమించిందని ప్రతిపక్ష రాజకీయ పార్టీలు ఆరోపించాయి. ఎన్నికల సంఘం ఈ ఆరోపణలను తోసిపుచ్చుతూ తాము చేపట్టిన చర్యను సరైనదిగా సమర్థించుకున్నది. ఎన్నికల సంఘం చర్యను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో అనేక వ్యాజ్యాలు పడ్డాయి. 2024లో జరిగిన పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ఒకసారి సవరించిన ఓటర్ల జాబితాను తిరిగి సవరించాలని గత ఎన్నికల సంఘం నిర్ణయించడం వెనుక ఉన్న వివాదాన్ని అలా ఉంచితే అసలు ఎన్నికల సంఘానికి ఈ విధంగా నిర్ణయించే చట్టబద్ధమైన అధికారాలు ఉన్నాయా లేదా అన్న అంశానికి మాత్రమే పరిమితమై నేను వివరించదలుచుకున్నాను.

అనర్హతకు గల కారణాలు: శాసనసభ, పార్లమెంటు ఎన్నికలు సార్వజనీన వయోజన ఓటింగ్ హక్కు ద్వారా నిర్వహించాలని మన రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 స్పష్టం చేస్తున్నది. ఏదైనా ప్రత్యేక కారణాలతో అనర్హుడిగా ప్రకటిస్తే తప్ప వయోజనులందరికి ఓటు హక్కు ఉంటుందని మన రాజ్యాంగం వివరిస్తుంది. ఓటరుగా గుర్తింపబడటానికి రెండు కీలక అర్హతలు ఉండాలని ఆర్టికల్ 326 నిర్దేశిస్తుంది–సదరు వ్యక్తి భారతీయ పౌరుడై, 18 ఏళ్ళ వయసు కలిగి ఉండాలి. అలాగే ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950 ఓటరుగా నమోదు చేయించుకోవడానికి ఎవరు అనర్హులో స్పష్టం చేస్తుంది. కోర్టు సాధికారికంగా ఎవరికైతే మతిస్థిమితం లేదని ప్రకటిస్తుందో అలాంటి వారు ఓటరుగా నమోదు చేయించుకోవడానికి అనర్హులని ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950లోని సెక్షన్ 11ఎ వివరిస్తుంది. అలాగే ఓటరుగా నమోదు చేయంచుకోవడానికి కావాల్సిన అర్హతలు ఏమిటో సెక్షన్ 19 స్పష్టం చేస్తున్నది. ఆ వ్యక్తి వయసు 18 సంవత్సరాలకు తగ్గకుండా ఉండి, అతను సదరు నియోజకవర్గపు సాధారణ నివాసి అయిఉండాలని ప్రజా ప్రాతినిధ్య చట్టం నిర్దేశిస్తున్నది. సదరు నియోజక వర్గంలో నివాస గృహం ఉన్నంత మాత్రాన ఒక వ్యక్తి సాధారణ నివాసి అయిపోడనీ, అలాగే వ్యక్తి తాత్కాలికంగా తన సాధారణ నివాస ప్రాంతంలో లేకపోవడం మూలంగా అతను సాధారణ నివాసి కాకుండా పోడనీ ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950 లోని సెక్షన్ 20 వివరిస్తుంది.

పార్లమెంటుకు, శాసనసభలకు అలాగే రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పదవులకు ఓటర్ల జాబితాను సిద్ధం చేసి ఎన్నికలు నిర్వహించే విశేషాధికారం ఎన్నికల సంఘానికి వున్నది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ఎన్నికల సంఘానికి అటువంటి విశేషాధికారాలు కల్పించింది. అందుకే ఎన్నికల సంఘాన్ని 'అధికార రిజర్వాయర్'గా సుప్రీంకోర్టు అభివర్ణించింది. ఎన్నికలను స్వేచ్ఛగా, సమ రీతిన నిర్వహించడం రాజ్యాంగం పునాది నిర్మాణంలో కీలకమైన అంశం. ఈ కర్తవ్య నిర్వహణ కోసమే ఎన్నికల సంఘానికి తగిన అధికారాలు కల్పించబడ్డాయి.

అయితే మన రాజ్యాంగం ఏ రాజ్యాంగపరమైన సంస్థలకు కూడా అపరిమితమైన అధికారాలు కల్పించలేదు. ఈ కారణంగానే ఎన్నికల సంఘం తన పరిధిలో ఉన్న అధికారాలన్నిటినీ వినియోగించుకోవచ్చు కానీ తన విచక్షణాధికార పరిధిలో లేని అంశాల్లో చట్టానికి లోబడి వ్యవహరించాల్సి ఉంటుందని గతంలోనే సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మొహిందర్ సింగ్ గిల్ వర్సెస్ ప్రధాన ఎన్నికల కమిషనర్ కేసులో (1978) సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో ఈ విధంగా స్పష్టం చేసింది– "పార్లమెంటు కానీ, ఏదైనా రాష్ట్ర శాసనసభగానీ ఎన్నికలకు సంబంధించి న్యాయబద్ధమైన చట్టమేదైనా చేసి ఉంటే ఎన్నికల సంఘం ఆ చట్టానికి లోబడి తన విధులు నిర్వహించాలే తప్ప, ఆ చట్టాన్ని ఉల్లంఘించరాదు. అయితే చట్టం స్పష్టీకరించని అంశాల విషయంలో ఎన్నికలను స్వేచ్ఛగా సమ రీతిన నిర్వహించడానికిగాను విన్నికల సంఘం రాజ్యాంగంలోని 324వ ఆర్టికల్‌ను అనుసరించి విశేషాధి కారాలు వినియోగించుకోవచ్చు.

అర్హతల తేదీ: ఎన్నికల జాబితాను సవరించడానికి ఎన్నికల సంఘానికి ప్రజాప్రాతినిధ్య చట్టం ఎటువంటి అధికారాలు కల్పించిందో ఇప్పుడు మనం చూద్దాం. 1950 నాటి ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 21 ఎన్నికల జాబితా రూపకల్పనకు, సవరణలకు ఎన్నికల సంఘానికి కొన్ని అధికారాలను కల్పించింది. ఎన్నికల జాబితా సవరణకు సంబంధించి నాలుగు దశలను సూచించింది. 1.లోక్‌సభ, శాసనసభ ఎన్నికలకు ముందు, 2. ప్రతి ఉప ఎన్నిక సందర్భంగా, 3. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఏ ఏడాదిలో అయినా, 4. ఏదేని నియోజకవర్గంలో పూర్తిగా కానీ, పాక్షికంగా గానీ ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టాలి అనుకుంటే అందుకు తగిన కారణాలను ఎన్నికల సంఘం స్పష్టం చేస్తూ చేపట్టవచ్చు. పైన పేర్కొన్న వాటిలో నాల్గవ అంశంలో పేర్కొన్న సవరణకు మినహా మిగిలిన మూడు అంశాల ఆధారంగా సవరణ చేపట్టాలంటే సెక్షన్ 14ను అనుసరించి నిర్ధారిత తేది జనవరి 1గా ఉండాలి. నాల్గవ అశం మేరకు సవరణ చేపట్టడానికి అలాంటి నియమిత నిర్ధారిత తేదీ ప్రస్తావన లేదు.

బీహార్ ఓటర్ల జాబితాలో ప్రత్యేక సమగ్ర సవరణ చేట్టడానికి ఎన్నికల సంఘం 2025 జూన్ 24న ఇచ్చిన ఆదేశాలలో ఈ తేదీని 2025 జులై 1 అని ప్రజా ప్రాతినిధ్య చట్టం సెక్షన్ 21(2) (బి) కింద పేర్కొన్నది. అయితే ఈ సెక్షను కింద ఆదేశాలు ఇవ్వాలంటే ఓటర్ల జాబితా సవరణకు నిర్ధారిత తేది 2025 జనవరి 1 కావాలి. కాబట్టి




జూన్ 24న ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలలో పేర్కొన్న నిర్ధారిత తేది (2025 జులై 1) చట్టం ప్రకారం చెల్లనేరదు. అంతేకాదు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నిర్వహించడానికి అసలు ఆ పదజాలమే చట్టంలో లేదు. ఎన్నికల సంఘం ఏదైనా నియోజక వర్గంలో పూర్తిగా గానీ, పాక్షికంగా గానీ ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టవచ్చుగానీ ఏకంగా ఒక రాష్ట్రం మొత్తం మీద అలాంటి సవరణ చేపట్టే అధికారం ఎన్నికల సంఘానికి లేదు.

అంటే ప్రజా ప్రాతినిధ్య చట్టాన్ని అనుసరించి బీహార్‌లో ఎన్నికల జాబితాకు ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టే అధికారం కేంద్ర ఎన్నికల సంఘానికి లేదని స్పష్టమవుతున్నది. చట్టంలో సెక్షన్ 21ని అనుసరించి మాకు అలాంటి అధికారం ఉందని ఎన్నికల సంఘం చెప్పుకుంటూ వస్తున్నది. నిజమే, ఆ సెక్షను ప్రకారం అలాంటి అధికారం ఒక నియోజకవర్గానికి పూర్తిగానో, పాక్షికంగానో మాత్రమే చేపట్టడానికి పరిమితమని ఎన్నికల సంఘం మరిచిపోతున్నది.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215